నేటి నిజం
తెలుగు దినపత్రిక
website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com
హైదరాబాద్ శుక్రవారం 25-9-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:47 పేజీలు:6 వెల: రూ.1/-

**నేటి కందం-నేటికి అందం**

ఆరాధించి క్రికెట్టును
తీరుగ సాధన మొనర్చి దేవుని దయతో
పోరాడి ఆసియాలో
భారత మహిళలు గెలిచిరి స్వర్ణ పతకమున్ !!

(ఆసియా క్రీడల్లో క్రికెట్ ఆటలో భారత మహిళలు స్వర్ణ పతకం సాధించారు. ఇది భారతీయు లందరికీ గర్వకారణం.)



-రాధశ్రీ
సెల్:9494481210

**చురక**

సీఈసీ ఏకపక్ష
చిందులేసే భాగోతం
సర్ పేరిట ఓటర్లను
చెరిపేసే దురాగతం.
సభ్యుల్లో అసమ్మతి
సెగల బాంబు పేలింది
నిష్పాక్షిక నిర్ణయాల
నీతి పగిలి కూలింది



-వేల్పుల నారాయణ
9440433475

# సీఎం రేవంత్ రెడ్డికి ప్రతిష్టాత్మక పురస్కారం..
## 'బెస్ట్ పబ్లిక్ సర్వెంట్-2026' అవార్డుకు ఎంపిక



హైదరాబాద్, సెప్టెంబర్ 24: తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మక పురస్కారం ఆర్యదాన్ మహమ్మద్-2026కు ఎంపికయ్యారు. ఈ ఏడాది బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ అవార్డును ఆయన అందుకోనున్నారు. శుక్రవారం కేరళంలోని నిలంబూరులో జరిగే కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డికి ఈ అవార్డును నిర్వాహకులు ప్రదానం చేయనున్నారు. రేవంత్ రెడ్డి పాలనలో రైతులు, బీసీలు, సామాన్య పౌరుల కోసం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలకుగాను ఆయనను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు నిర్వాహకుల జ్యూరీ వెల్లడించింది.

ప్రజాస్వామిక విలువలపై సీఎం రేవంత్ రెడ్డి నిబద్ధతను ఈ సందర్భంగా జ్యూరీ ప్రశంసించింది. ఆర్యదాన్ మహమ్మద్ నాలుగో వర్ధంతి సందర్భంగా రేపు (శుక్రవారం) ఈ పురస్కారాన్ని సీఎం రేవంత్ రెడ్డి అందుకోనున్నారు. కేరళంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన దివంగత సీనియర్ నేత, మాజీ మంత్రి ఆర్యదాన్ మహమ్మద్ స్మారకార్థం ఈ పురస్కారాన్ని ఏర్పాటు చేశారు.

# ఐబొమ్మ రవికి నాంపల్లి కోర్టులో ఊరట

హైదరాబలాద్, సెప్టెంబర్ 24: ఐబొమ్మ ఇమ్మడి రవికి నాంపల్లి కోర్టులో ఊరట కలిగింది. పోలీసులు సీజ్ చేసిన రవి బ్యాంకు ఖాతాలను ఆయన తన లావాదేవీల కోసం ఉపయోగించుకోవచ్చని కోర్టు సూచించింది. ఇందుకోసం రవికి అనుమతి ఇవ్వాలని పోలీసులకు కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అయితే, ఆ బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.3 కోట్ల నగదును అన్‌ఫ్రీజ్ చేయడానికి న్యాయస్థానం నిరాకరించింది. ఆర్థిక ఇబ్బందులతో కుటుంబాన్ని పోషించలేకపోతున్నానని నిందితుడు 8 రోజుల క్రితం పిటిషన్ వేశాడు. తన బ్యాంకు ఖాతాల్లో ఫ్రీజ్ అయిన రూ.3 కోట్ల నగదును ఉపయోగించుకునేలా పోలీసులకు ఆదేశాలు ఇవ్వాలని ఐబొమ్మ రవి కోరగా.. అందుకు కోర్టు ఒప్పుకోలేదు. బ్యాంకు అకౌంట్లను ఉపయోగించుకోవడానికి మాత్రమే అనుమతి ఇస్తామని న్యాయస్థానం స్పష్టం చేసింది.కాగా.. పైరసీకి పాల్పడుతూ సినిమా పరిశ్రమకు రూ.వేల కోట్ల నష్టాన్ని కలిగించడమే కాకుండా, బెట్టింగ్ యాప్‌లను ప్రచారం చేసి రూ.కోట్లు సంపాదించాడన్న ఆరోపణలపై ఇమ్మడి రవిని హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు నిరుడు నవంబర్‌లో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ ఏడాది ఫిబ్రవరిలో అతడికి బెయిల్ లభించింది. అయితే, అరెస్టు సమయంలో పోలీసులు తన ఖాతాల్లో ఫ్రీజ్ చేసిన రూ.3 కోట్లు తిరిగి అన్‌ఫ్రీజ్ చేయించాలని కోరుతూ నాంపల్లి 9వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో ఇమ్మడి రవి పిటిషన్ దాఖలు చేశాడు. తాను ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నానని, కుటుంబాన్ని పోషించుకోవడం కష్టంగా ఉందని తెలిపాడు.

# సీఈసీ జ్ఞానేశ్ కుమార్ 48 గంటల్లోగా రిజైన్ చేయాలి: కాక్రోచ్ పార్టీ డిమాండ్



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24: చీఫ్ ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ 48 గంటల్లోగా రాజీనామా చేయాలని కోరుతూ కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్ చేసింది. ఒకవేళ 48 గంటల్లోగా జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయకుంటే, అప్పుడు దేశవ్యాప్తంగా ఆందోళన చేపట్టనున్నట్లు సీజేపీ తన వార్నింగ్‌లో పేర్కొన్నది. నిరవధిక నిరాహార దీక్షకు దిగనున్నట్లు సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తెలిపారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చీఫ్ ఎలక్షన్ కమిటీసణర్ అతిపెద్ద జాతి వ్యతిరేకి అని, జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని, భారత ప్రజాస్వామ్యానికి ఆయన పెను ప్రమాదంగా మారినట్లు అభిజీత్ ఆరోపించారు.

ఎలక్షన్ కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషిలు.. ముఖ్య ఎన్నికల అధికారిపై ఆరోపణలు చేశారు. గడిచిన 10 నెలల్లో 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేశామని, కానీ పూర్తి స్థాయి ఎలక్షన్ కమిషన్ పేరుతో నిర్ణయాలు తీసుకున్నారని, తమ అనుమతి లేకుండానే ఆ నిర్ణయాలను వెల్లడించారని, సీఈసీ నిర్ణయాలు అక్రమ రీతిలో ఉన్నట్లు ఇద్దరు కమిషనర్లు చేసిన ఆరోపణలపై ఓ మీడియా కథనాన్ని రాసింది. ఈ నేపథ్యంలో సీజేపీ నేతలు ఇవాళ మీడియా సమావేశం నిర్వహించారు.

సీఈసీగా జ్ఞానేశ్ కుమార్ బాధ్యతలు చేపట్టిన తర్వాత .. ఎవరికి ఓటు రావాలి, ఎవరికి ఓటు వద్దు అన్ని విషయాన్ని ప్రభుత్వం నిర్ణయిస్తోందని, ప్రజాస్వామ్యం అంటే ఇదేనా అంటూ అభిజీత్ ప్రశ్నించారు. సుమారు 3 కోట్ల మంది ఓటర్లను తొలగించారని, ఇదేమీ చిన్న సంఖ్య కాదు అని, , 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ, విపక్షాల మధ్య తేడా కేవలం 2 శాతం ఓట్లు మాత్రమే అని, 13 కోట్ల మంది ఓటర్లను డిలీట్ చేయడం అంటే, దాదాపు 13 నుంచి 14 శాతం ఓట్లను తొలిగించడమే అవుతుందని అభిజీత్ అన్నారు. ఆ 2 శాతం వ్యత్యాసాన్ని పెంచేందుకు జ్ఞానేశ్‌కుమార్ ప్రయత్నాలు చేస్తున్నారా అని కూడా ప్రశ్నించారు.

# గవర్నర్ చే విద్యార్థికి రూ.2 లక్షల నగదు అందజేత..
## శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ పురస్కారం.. సర్కారు బడి ఎస్ఎస్సీ జిల్లా టాపరు.




జన్నారం, సెప్టెంబర్ 24: మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని కిష్టాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన గత ఎస్ఎస్సీ టెన్త్ విద్యార్థిని లసెట్టి శ్వేత రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ రూ.2 లక్షల నగదు పురస్కారాన్ని అందుకున్నారు. చదువుకో తెలంగాణ బహుమానం కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ లోని సెంచరీ కన్వెన్షన్ సెంటర్లో గురువారం శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ నిర్వహించిన కార్యక్రమంలో ఆ విద్యార్థికి పురస్కారం డబ్బులు అందజేసి, ప్రశంసాపత్రం గవర్నర్ గురువారం మధ్యాహ్నం అందజేశారు.అరుదైన అవకాశం రావడం పట్ల జిల్లా ఇన్చార్జి విద్యాశాఖ అధికారి పి చంద్రయ్య,మండల విద్యాధికారి, బి.రాజేందర్, పాఠశాల హెచ్.ఎం గుండ రాజన్న, గ్రామ సర్పంచి వాసాల నరేష్, పాఠశాల ఏఏపీసీ చైర్మన్ మంగ, పాఠశాల ఉపాధ్యాయులు జాడి మురళి,దాముక కమలాకర్,గోవర్ధన చారి, కొట్టే రాజన్న, ప్రకాష్ బానవత్, నరహరి శర్మ, అభినందించారు.

# ముంపు ప్రాంతాలను పరిశీలించిన వైరా మున్సిపల్ చైర్‌పర్సన్

ఖమ్మం, సెప్టెంబర్ 24:: వైరా మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు రాజీవ్‌నగర్‌లో భారీ వర్షాలతో ముంపునకు గురైన ప్రాంతాలను మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ గురువారం పరిశీలించారు. వర్షపు నీరు ఇళ్లలోకి చేరడంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నామని, పరిస్థితి పూర్తిగా చక్కబడే వరకు మున్సిపల్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అవసరమైతే ముంపు ప్రాంతాల ప్రజలను ప్రభుత్వ హైస్కూల్‌కు తరలించి, వారికి అవసరమైన వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఎంతటి నేతలకైనా ప్రజా వ్యతిరేకత ఖాయం: రాహుల్ గాంధీ

ఢిల్లీ, సెప్టెంబర్ 24: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి విరుచుకుపడ్డారు. ఎంతటి బలమైన నాయకులైనా కొన్నేళ్ల పాలన తర్వాత వారిపై ప్రజా వ్యతిరేకత రావడం సహజమని, అయితే ఆ వ్యతిరేకత నుంచి తప్పించుకునేందుకు బీజేపీ తీవ్ర ప్రయత్నాలు చేస్తోందని రాహుల్ విమర్శించారు.

అయితే కొన్ని రాష్ట్రాల్లో ఈ ప్రజా వ్యతిరేకత ఎందుకు బయటకు కనిపించడం లేదో అర్థం కావడం లేదని, రాత్రికి రాత్రే ఇది ఎలా మాయమవుతుందని రాహుల్ ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వం దేశంలోని స్వతంత్ర రాజ్యాంగ వ్యవస్థలను దుర్వినియోగం చేస్తూ, తమపై ఉన్న ప్రజా వ్యతిరేకతను కనుమరుగు చేసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తూ బీజేపీ ప్రభుత్వం 'ఓట్ చోరీ'కి పాల్పడుతోందని రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

# మోదీతో ఆల్ట్‌మన్, డారియో ఫొటోను ఎడిట్ చేసిన మేటా ఏఐ చీఫ్..

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 24:మేటా ఏఐ చీఫ్ అలెగ్జాండర్ వాంగ్ తాజాగా ఓ ఫొటోను షేర్ చేసి ఆపై డిలీట్ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల భారత్‌లో జరిగిన ఏఐ సమ్మిట్ సందర్భంగా ప్రధాని మోదీ అమెరికా ఏఐ సంస్థల సీఈఓలు ఉన్న చిత్రం అది. మ్యూజ్ ఏఐ సాయంతో ఆ ఫొటోను అలెగ్జాండర్ వాంగ్ ఎడిట్ చేశారు. ఎడమొహంపెడమొహంగా ఉన్న ఓపెన్ ఏఐ, ఆంత్రోపిక్ ఏఐ సీఈఓల మధ్య మ్యూజ్ మాస్కట్‌ను జోడించి ఈ ఫొటోను షేర్ చేశారు. ఇరు ఏఐ సంస్థల సీఈఓల మధ్య సయోధ్య కుదర్చినట్టు సెటైరికల్‌గా ఈ పోస్టు చేశారు. ఆ తరువాత డిలీట్ చేశారు.

ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమిట్ సమయంలో ఓపెన్ ఏఐ సీఈఓ ఆల్ట్‌మన్, ఆంత్రొపిక్ సీఈఓ డారియో ప్రధాని మోదీతో కలిసి ఫొటో దిగేందుకు నిలబడ్డారు. అది గ్రూప్ ఫొటో కావడంతో అందరూ కలిసి చేతులు కలిపి నిలబడాల్సి ఉంది. అయితే, వాణిజ్యపరంగా ప్రత్యర్థులైన డారియో, ఆల్ట్‌మన్‌లు పక్కపక్కనే ఉన్నప్పటికీ చేతులు కలిపి ఫొటోకు ఫోజులిచ్చేందుకు నిరాకరించారు. దీంతో, ఈ ఉదంతం అప్పట్లో వైరల్‌గా మారింది.

తీజూణమ్యూజ్ ఏఐ ఏం చేయగలదో చూడండంటూ వాంగ్ ఈ ఏఐ ఎడిటెడ్ ఫొటోను షేర్ చేశారు. ఫొటోలో డారియో, ఆల్ట్‌మన్ మధ్య మ్యూజ్ మాస్కట్ వారి చేతులు పట్టుకుని చిరునవ్వులు చిందిస్తూ కనిపించింది. వారి మధ్య రాజీ కుదరినట్టు ఉన్నందున మ్యూజ్‌కు నోబెల్ ప్రైజ్ ఇవ్వాలనే అర్థంలో వాంగ్ మరో సరదా కామెంట్ చేశారు. మా నోబెల్ బహుమతిని ఎక్కడికి వెళ్లి తెచ్చుకోవాలో చెప్పాలని అన్నారు.

అయితే, జనాల నుంచి మంచి స్పందిన వస్తున్న తరుణంలో ఈ ఫొటో కనుమరుగైంది. వాంగ్ ఆ ఫొటోను తన టైమ్ లైన్ లోంచి డిలీట్ చేశారు. ఇందుకు కారణం ఏంటీ అనే వివరాలపై స్పష్టత లేదు. మరో కాంట్రవర్సీ అవుతుందని తానే వెనక్కు తగ్గారా? లేక ఎవరైనా తీసేయమని చెప్పారా? అనే విషయాలు తేలాల్సి ఉంది. ఈ పోస్టు ప్రస్తుతం వాంగ్ టైమ్ టైమ్‌లో లేకపోయినప్పటికీ ఇందుకు సంబంధించి స్క్రీన్ షాట్స్ మాత్రం నెట్టింట వైరల్ అవుతూనే ఉన్నాయి.

# ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో బీజేపీ విజయం
## ఖాయం: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 24: ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కేసులో సుప్రీంకోర్టు తీర్పును మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నానని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. పార్టీ ఫిరాయింపుల చట్టం ఉల్లంఘనపై సుప్రీంకోర్టు తీర్పు చెంపపెట్టు అని అభివర్ణించారు. ఇది అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలకు గుణపాఠమని అన్నారు. పార్టీ ఫిరాయింపునకు పాల్పడిన ఎమ్మెల్యే దానం నాగేందర్ వ్యవహారంలో సుప్రీంకోర్టు గురువారం స్పందించింది.

ఈ నేపథ్యంలో దీనిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. నాడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చేర్చుకుని బీఆర్ఎస్ ప్రభుత్వం చట్ట వ్యతిరేకంగా మంత్రులను చేసిందని.. నేడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేను చేర్చుకుని కాంగ్రెస్ తమ పార్టీ తరపున ఎంపీగా పోటీ చేయించిందని గుర్తు చేశారు. త్వరలో జరగనున్న ఖైరతాబాద్ ఉప ఎన్నికలో.. రెండు ఫిరాయింపు పార్టీలకు ప్రజలు బుద్ధి చెబుతారని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఉప ఎన్నికలో బీజేపీ ఘనవిజయం ఖాయమని కిషన్ రెడ్డి జోస్యం చెప్పారు.

దానం నాగేందర్ పిటిషన్ సుప్రీంకోర్టు కొట్టివేయడంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యం అవుతుందని తెలిపారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నుంచి దానం నాగేందర్ బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి.. 2024లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారని తెలిపారు. దీనిపై తెలంగాణ హైకోర్టును బీజేపీ ఆశ్రయిస్తే.. 2024 ఏప్రిల్ 23 నుంచి ఆయనను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించిందని.. దీన్ని సుప్రీంకోర్టు తాజాగా సమర్థించిందని అన్నారు.

ఈ తీర్పు ఒక్క కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన అంశం మాత్రమే కాదని.. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు చట్టవ్యతిరేకంగా అనుసరిస్తున్న పార్టీ ఫిరాయింపుల రాజకీయాలకు ఇది ఓ గుణపాఠమని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్ష ఎమ్మెల్యేలను తమ పార్టీలో చేర్చుకోవడం.. వారికి మంత్రిపదవులు ఇవ్వడం తెలంగాణ రాజకీయాల్లో ఈ రెండు పార్టీలు ఓ దురదృష్టకరమైన సంస్కృతిగా మార్చారని మండిపడ్డారు. ప్రజా తీర్పును కాలరాయడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తెలంగాణలో పోటీ పడుతూ.. ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ ఫిరాయింపులను విమర్శించడం అధికారంలోకి వచ్చాక అదే ఫిరాయింపులను ప్రోత్సహించడం ఈ రెండు పార్టీల రాజకీయ ద్వంద్వ వైఖరికి అద్దం పడుతుందని చెప్పారు. ప్రజా తీర్పును తమ రాజకీయ అవసరాలకు అనుగుణంగా కాల రాస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ అవకాశవాద రాజకీయాలకు సుప్రీంకోర్టు తీర్పు స్పష్టమైన హెచ్చరిక అని తెలిపారు.

దానం నాగేందర్ ఎమ్మెల్యే పదవి అనర్హత కారణంగా ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయిందని పేర్కొన్నారు. ఇప్పుడు ఖైరతాబాద్ ప్రజలు.. అవకాశవాద, స్వార్థ, ఫిరాయింపు రాజకీయాలకు వ్యతిరేకంగా తమ ప్రతినిధిని ఎన్నుకునే అవకాశం రానుందని అన్నారు. ప్రజాస్వామ్యంలో అంతిమ నిర్ణేతలు ప్రజలేనని వివరించారు. ఈ రెండు పార్టీల కుళ్లు రాజకీయాలకు తగిన బుద్ధి చెప్పి.. ఖైరతాబాద్ అసెంబ్లీ ప్రజలు.. వచ్చే ఉప ఎన్నికలో బీజేపీకి పట్టంగట్టడం ఖాయమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.



# దీన్‌దయాల్ ఉపాధ్యాయ సేవలు ప్రశంసనీయం

## (25 సెప్టెంబర్ "అంత్యోదయ దినోత్సవం" సందర్భంగా)

2014 నుంచి భారత కేంద్ర ప్రభుత్వం పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జన్మదినం సందర్భంగా ప్రతి ఏట 25 సెప్టెంబర్ రోజును "అంత్యోదయ దినోత్సవం (అంత్యోదయ దివస్)" పాటించడం కొనసాగుతున్నది. అట్టడుగు వర్గాల ఉన్నతికి దీన్‌దయాల్ ఉపాధ్యాయ చేసిన అవిశ్రాంత సేవలను గుర్తు చేసుకోవడానికి, వీరి జీవితం నుంచి ప్రేరణ పొందడానికి ఈ వేదికను వినియోగించుకుంటున్నాం. 1965లో పండిట్ దీన్‌దయాల్ ప్రతిపాదించిన "సమగ్ర మానవతావాదం (ఇంటెగ్రల్ హూమనిజమ్)" ఆలోచనల ద్వారా సామాజిక బాధ్యత, అభివృద్ధిల మధ్య సమతుల్యత సాధించాలని ప్రచారం చేశారు. అభివృద్ధి వరుసలో చివరి వ్యక్తికి కూడా అభివృద్ధి ఫలాలు అందితేనే అసలైన సమగ్రాభివృద్ధి, శ్రేయస్సు అవుతుందని వివరించారు.

### అభివృద్ధికి దూరంగా ఉన్న చివరి వ్యక్తి ఎదుగుదల :

అంత్యోదయ అనే పదంలో అంత్య (చివరి), ఉదయ్(ఎదుగుదల) అనే 'చివరి వ్యక్తి ఎదుగుదల లేదా అత్యంత పేద వ్యక్తి అభ్యున్నతి' అనబడే అర్థం దాగి ఉన్నది. ఉపాధ్యాయ ఆలోచనలు, లక్ష్యాల ప్రకారం అభివృద్ధికి దూరంగా ఉన్న అభాగ్య అట్టడుగు వర్గాలకు కూడా అభివృద్ధి ఫలితాలు అందిన నాడే అసలైన సామాజిక, ఆర్థిక సమానత్వం సాధించబడుతుందని స్పష్టం చేశారు. అంత్యోదయ దినం వేదికగా నిరు పేదలకు సంక్షేమ పథకాల అమలు, సమ్మిళిత అభివృద్ధి, సామాజిన న్యాయ కల్పన, పాలసీల విశ్లేషణలు, ప్రజల్లో అవగాహన, పేదరికం నిర్మూలన, సామాజిక అభివృద్ధి, చైతన్యం లాంటి లక్ష్యాలను సుసాధ్యం చేయడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. 25 సెప్టెంబర్ 2016 రోజున కేంద్ర ప్రభుత్వం "దీన్‌దయాల్ అంత్యోదయ యోజన" అనే పథకాన్ని ప్రవేశపెట్టి పేదరిక నిర్మూలనకు నడుం బిగించడం జరిగింది. ఈ పథకంలో భాగంగా నైపుణ్య శిక్షణ,ఉద్యోగ ఉపాధుల కల్పన, గృహ నిర్మాణాలు, వీధి వ్యాపారుల ఉన్నతి, మహిళా స్వయం సహాయక బృందాల ఏర్పాటు, సుస్థిర గ్రామీణ అభివృద్ధి, స్వల్ప కాలిక రుణాల వెసులుబాటు లాంటి అంశాలను అమలు చేయడం జరుగుతోంది.

### బహుముఖ ప్రజ్ఞాశాలి పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ:

భారతీయ ప్రముఖ నాయకులు, భారతీయ జనసంఘ్ సహ-వ్యవస్థాపకులు, ఆర్‌ఎస్‌ఎస్ విధాన ఆలోచనాపరుడు అయిన పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ మన దేశ రాజకీయ యవనికపై చెరగని ముద్రను వేశారు. యూపీ, మధుర జిల్లా నాగ్రా చంద్రబన్ గ్రామంలో 25 సెప్టెంబర్ 1916న జన్మించిన దీన్‌దయాల్ ఉపాధ్యాయ చిరుప్రాయంలోనే తల్లితండ్రులను కోల్పోయారు. తన సమీప బంధువు చొరవతో కాన్పూర్‌లో బి. ఏ. డిగ్రీని అత్యున్నత మార్కులతో పొందారు. 1937లో ఆర్‌ఎస్‌ఎస్‌లో చేరి దేశభక్తిని నరనరాల్లోకి ఎక్కించుకున్నారు. 1951లో భారతీయ జన సంఘ్ స్థాపనలో ప్రధాన పాత్రను పోషించి ఆ పార్టీకి జనరల్ సెక్రటరీగా బాధ్యతలు చేపట్టారు. 11 ఫిబ్రవరి 1968 రోజున తన 51వ ఏట దురదృష్టకరంగా హత్య చేయబడ్డారు. 1953 నుంచి 1968 వరకు భారతీయ జనసంఘ్‌కు సేవలు అందించి, బిజెపీకి సైద్ధాంతిక కర్తగా మర్గనిర్దేశనం, నైతిక ప్రేరణకు మూలంగా నిలిచారు. దీనుల పాలిటి దయామయుడు ఉపాధ్యాయ జీవితం కడు పేదల అభ్యున్నతికే అంకితం అయ్యింది.

ప్రముఖ రచయిత, థింకర్, అట్టడుగు వర్గాల పక్షపాతి, అహింసాయుత ఆలోచనలు, కులమతవర్ణవర్గ విభేదాలు మరిచి సమానత్వ సాధన, సామాజిక న్యాయం, మానవీయ సంపద, సత్య ధర్మాలను పాటించడం, స్వదేశీ వస్తు ప్రచారకులు లాంటి అనేక విలక్షణతలు పరిచయం చేసిన దీన్‌దయాల్ ఉపాధ్యాయ జీవితం మనందరికీ దారి దీపం కావాలి. వారి బోధనలు మనకు నిత్య మంత్రాలుగా జపించబడాలి.



-మధుపాళీ
9949700037

# కరెంట్ కోతలతో రైతులను వేధిస్తున్న ప్రభుత్వం.. వెంటనే విద్యుత్ కోతలు నిలిపివేయాలి!

### రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించాలి ? బడే నాగజ్యోతి డిమాండ్
### కేసీఆర్ హయాంలో వెలుగులు.. కాంగ్రెస్ పాలనలో కరెంట్ కష్టాలు
### భూపాలపల్లి థర్మల్ పవర్ స్టేషన్ వద్ద :ఖీూ ఆధ్వర్యంలో మహాధర్నా



ములుగు, సెప్టెంబర్ 24:(నేటినిజం ప్రతినిధి): కెటిఆర్ గారి ఆదేశాల మేరకు, భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి గారి ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాలో బిఆర్ఎస్ పార్టీ ఉమ్మడి జిల్లా ఆదినాయకత్వంతో కలిసి ములుగు నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ బడే నాగజ్యోతి గారు పాల్గొన్నారు.బడే నాగజ్యోతి గారి ఘాటు వ్యాఖ్యలు కేసీఆర్ హయాంలో తెలంగాణ విద్యుత్ రంగం దేశానికే ఆదర్శంగా నిలిచింది.

రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిది.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ కోతలతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రైతులకు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించాలి.

కరెంట్ కోతల కారణంగా రైతుల పంటలు ఎండిపోయే పరిస్థితి రావద్దు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి.

విద్యుత్ ఉత్పత్తి, సరఫరాపై ప్రభుత్వం ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలి.

రైతుల సమస్యలను పట్టించుకోకుండా రాజకీయ విమర్శలకు పరిమితం కాకుండా.. క్షేత్రస్థాయిలో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి.

"రైతుల పొలాలకు కరెంట్ కావాలి.. ప్రభుత్వ ప్రకటనలు కాదు!"

రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించే వరకు, కరెంట్ కోతలకు వ్యతిరేకంగా :ఖీూ పోరాటం కొనసాగుతుందని బడే నాగజ్యోతి తెలిపారు.

# ఒంటికొమ్ము ఖడ్గమృగాల సంరక్షణ ప్రయత్నాలను ప్రశంసిస్తూ కేంద్ర మంత్రి శ్రీ భూపేందర్ యాదవ్ రాసిన వ్యాసాన్ని పంచుకున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24:కేంద్ర మంత్రి శ్రీ భూపేంద్ర యాదవ్ రాసిన ఓ వ్యాసాన్ని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ పంచుకున్నారు.

భారత్‌లో ఖడ్గమృగాల సంరక్షణ కథ.. ఆ జాతి జీవుల పునరుజ్జీవనానికి అద్భుతమైన నిదర్శనమని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఖడ్గమృగాల జనాభా నిరంతరం పెరుగుతుండటంతో, ప్రపంచంలోనే ఒంటికొమ్ము ఖడ్గమృగాల సంరక్షణలో భారత్ అత్యంత కీలక పాత్ర పోషిస్తోందని ఆయన తెలిపారు. వీటి మనుగడకు ఆధారమైన గడ్డిభూములు, చిత్తడి నేలలను కాపాడుకోవడం ఈ జీవుల భవిష్యత్తుకు ఎంతో అవసరమని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ చర్యలు ఈ సంరక్షణ ప్రయాణాన్ని ఏ విధంగా బలోపేతం చేస్తున్నదీ కేంద్ర మంత్రి రాసిన ఈ వ్యాసం వివరిస్తుందని ప్రధాని పేర్కొన్నారు.

ఖడ్గమృగాల సంఖ్య స్థిరంగా పెరుగుతున్న నేపథ్యంలో, ప్రపంచంలో ఒంటి కొమ్ము ఖడ్గమృగాల సంరక్షణలో అత్యంత ముఖ్య దేశాల్లో భారత్ ఒకటిగా నిలిచింది. ఈ జాతి మనుగడకు ఆధారమైన గడ్డి భూములు, చిత్తడి నేలలను రక్షించడం వాటి భవిష్యత్తుకు ఎంతో కీలకం.

కేంద్ర మంత్రి శ్రీ భూపేందర్ యాదవ్ రాసిన ఈ ముఖ్యమైన కథనం, ఖడ్గమృగాల సంరక్షణ ప్రయత్నాలను ప్రభుత్వ చర్యలు ఏ విధంగా బలోపేతం చేస్తున్నదీ వివరిస్తుంది"

# 'సరికొత్త ప్రపంచం కోసం ఆధ్యాత్మిక జాగృతి' ప్రచార ఉద్యమాన్ని గుజరాత్.. వడోదరాలో ప్రారంభించిన రాష్ట్రపతి..

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 24:'సరికొత్త ప్రపంచం కోసం ఆధ్యాత్మిక జాగృతి' పేరిట బ్రహ్మ కుమారీలు చేపట్టిన కార్యక్రమాన్ని రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము గుజరాత్.. వడోదరాలో ఈ రోజు, అంటే 2026 సెప్టెంబర్ 23న ప్రారంభించారు. 'గ్లోబల్ స్పిరిచువల్ ప్యాలెస్' రిట్రీట్ సెంటరును కూడా రాష్ట్రపతి ప్రారంభించారు. ఈ సందర్భంగా, "వికసిత్ భారత్ కోసం యువత: దేశ నిర్మాణం కోసం అంతర్గత శక్తిని మేల్కొలపడం" పేరిట గుజరాత్.. నడియాద్‌లో బ్రహ్మ కుమారీలు చేపట్టిన మరో ప్రచార ఉద్యమాన్ని రాష్ట్రపతి దృశ్య మాధ్యమం సాయంతో ప్రారంభించారు.

సభను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగిస్తూ, ఒక్క ఆర్థిక అభివృద్ధే కాకుండా మానవ వికాసం కలగాల్సిన అవసరం కూడా ఉందన్నారు. మేధస్సును పెంపొందింపచేసే విద్యతో పాటు, జ్ఞానాన్ని మేల్కొలిపే విద్య మనకు కావాలని శ్రీమతి ద్రౌపది ముర్ము అన్నారు. ప్రగతి సాధన, దాంతో పాటు ప్రకృతి పట్ల సానుకూల దృక్పథాన్ని కలిగి ఉండాలని వివరించారు. ఇతరులను నియంత్రించడానికి బదులు స్వీయ నియంత్రణను నేర్పే శక్తిని మనం అలవరుచుకోవాలనీ, మానవులందరినీ కలిపే ఆధ్యాత్మికత ప్రధానమనీ రాష్ట్రపతి అన్నారు. ధ్యానం, ఆధ్యాత్మిక జ్ఞానం ద్వారా వ్యక్తిగత పరివర్తన, సరికొత్త ప్రపంచం అన్న సందేశాలను బ్రహ్మకుమారీలు ఒక్క భారత్‌లోనే గాక ప్రపంచంలో అనేక దేశాలకు చేరవేశారని తెలుసుకొని సంతోషించానని రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము అన్నారు.

మార్పును ఆహ్వానించే సామర్థ్యం మనిషిలో ఉంటుందని రాష్ట్రపతి అన్నారు. వ్యక్తులు ఆలోచనలను, చేతలను మార్చుకోవడం వల్ల జీవితంలో మార్పును తీసుకురావడం సాధ్యపడుతుందని నమ్మితే, ఒక్క తమ లోపలే కాక పూర్తి సంఘంలో కూడా సకారాత్మక మార్పును తీసుకు రాగలిగే వారవుతారని శ్రీమతి ద్రౌపది ముర్ము అన్నారు. ఈ రోజు ప్రారంభించుకొన్న గ్లోబల్ స్పిరిచువల్ ప్యాలెస్.. రాబోయే కాలంలో విభిన్న వర్గాల వారు ఒక చోట చేరి శాంతియుతంగా, సద్భావనతో నడుచుకొనే కేంద్రంగా మారుతుందని తాను నమ్ముతున్నానని రాష్ట్రపతి అన్నారు.

"వికసిత్ భారత్ కోసం యువత: దేశ నిర్మాణం కోసం అంతర్గత శక్తిని మేల్కొలపడం" పేరిట చేపట్టిన ప్రచార ఉద్యమాన్ని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జన్మస్థలమైన నడియాద్‌లో దృశ్య మాధ్యమం ద్వారా ప్రారంభించినందుకు ఎంతో ఆనందంగా ఉందని రాష్ట్రపతి అన్నారు. యువతరం తమ ఆలోచనలను, భావోద్వేగాలను, చేతలను సకారాత్మకమైనవిగా ఉండేటట్లు చూసుకొంటే ఏర్పడే ప్రభావం కుటుంబంపై, పనిప్రదేశంపై, సమాజంపై, చివరికి పూర్తి దేశంపై పడుతుందని శ్రీమతి ద్రౌపది ముర్ము చెప్పారు. ఇందువల్ల, "అంతర్గత శక్తిని మేల్కొలపడం" వ్యక్తిగత వికాస సందేశాన్ని ఇవ్వడం మాత్రమే కాకుండా, దేశ నిర్మాణానికి సంబంధించిన విస్తృత ప్రక్రియని రాష్ట్రపతి అన్నారు. యువతకు సాధికారతను కల్పించడం మన అందరి బాధ్యతని రాష్ట్రపతి స్పష్టం చేశారు. వారిని స్వయంసమృద్ధి కలిగిన, శాంతిని కోరుకొనే, బాధ్యతాయుత పౌరులుగా మనం తప్పక తీర్చిదిద్దాలని శ్రీమతి ద్రౌపది ముర్ము అన్నారు.

వ్యక్తిలో పరివర్తన కలిగితే, అది సమాజ పరివర్తనకు పునాదిని వేస్తుందని భావిస్తారని రాష్ట్రపతి గుర్తు చేశారు. ప్రస్తుతం, ఈ ఘన వారసత్వాన్ని ఆధునిక జీవితావసరాలతో సమన్వయం చేయాల్సిన అవసరం ఉందని శ్రీమతి ద్రౌపది ముర్ము అన్నారు. ఆర్థికంగా సంపన్నమైన, విజ్ఞానశాస్త్రపరంగా ఆధునికమైన, ఆధ్యాత్మికంగా జాగృతమైన భారత్‌ను ఆవిష్కరించడమే మన లక్ష్యం కావాలని రాష్ట్రపతి ఉద్బోధించారు.

# ములుగు జిల్లా జంగాలపల్లి, కాసిందేవపేట మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం



ములుగు, సెప్టెంబర్ 24:(నేటినిజం ప్రతినిధి): ములుగు జిల్లా పరిధిలోని జంగాలపల్లి మరియు కాసిందేవపేట గ్రామాలకు చెందిన పలువురు మృతుల కుటుంబాలను ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు పరామర్శించి, వారి కుటుంబ సభ్యులకు ఆత్మీయ సానుభూతి తెలియజేశారు.

ఈ సందర్భంగా ఆయా బాధిత కుటుంబాలకు ఆయన ఆర్థిక సహాయం అందజేసి పార్టీ తరపున ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసానిచ్చారు.

ఈ కార్యక్రమంలో మసర కానీ వినయ్, తుమ్మ మల్లారెడ్డి, కాకులమర్రి ప్రదీప్ రావు, తాడూరి రఘు, కర్ర రవీందర్, ఎండి వలీ బాబా, ఎండి ఖాజా పాషా, కుమ్మరి చంద్రబాబు, జాడి,భోజారావు,బీఆర్ఎన్ అప్పాజీ ఐలయ్య,చింతం మల్లయ్య, కుమార్ - సర్పంచ్ (పెగడపల్లి), కల్తీ రంజిత్,లింగంపల్లి రవీందర్రావు, అడ్డూరి రాజు,మల్లయ్య ఉపసర్పంచ్,దెబ్బకట్ల రాజు, మాజీ సర్పంచ్ అల్లం బక్కారెడ్డి,ముఖ్య నాయకులు కళ్లెం శ్రీను - మాజీ వార్డ్ మెంబర్,బాబు కవ్వంపల్లి,మేకల కుమార్,రవీందర్ నాయక్ - ముఖ్య నాయకులు మరియు పార్టీ ముఖ్య కార్యకర్తలు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు

# మహిళల స్కీట్ టీమ్ విభాగంలో కాంస్యం గెలుచుకున్న పరినాజ్ ధలీవాల్, మహేశ్వరి చౌహాన్, రైజా థిల్లాన్‌లకు ప్రధానమంత్రి అభినందనలు

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 24:మహిళల స్కీట్ జట్టు విభాగంలో కాంస్య పతకం సాధించిన పరినాజ్ ధలీవాల్, మహేశ్వరి చౌహాన్, రైజా థిల్లాన్‌లకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేడు అభినందించారు.

విజేతల ఏకాగ్రత, ఖచ్చితత్వం, సమష్టికృషి భారతీయ క్రీడారంగానికి మరో గర్వకారణమైన క్షణాన్ని అందించాయని ప్రధానమంత్రి పేర్కొన్నారు. భవిష్యత్తులో జరిగే పోటీల్లో వారు మరిన్ని విజయాలు సాధించాలని ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ప్రధానమంత్రి కార్యాలయం ఈ విధంగా పేర్కొంది.

"మహిళల స్కీట్ జట్టు విభాగంలో కాంస్య పతకం సాధించిన పరినాజ్ ధలీవాల్, మహేశ్వరి చౌహాన్, రైజా థిల్లాన్‌లకు అభినందనలు.

క్రీడాకారుల ఏకాగ్రత, ఖచ్చితత్వం, జట్టుకృషి భారతీయ క్రీడలకు మరొక గర్వకారణమైన క్షణాన్ని తెచ్చిపెట్టాయి. వారు భవిష్యత్తులో చేపట్టే ప్రయత్నాలకు శుభాకాంక్షలు: ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ"






# పురుషుల వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకం సాధించి, ఆసియా క్రీడల్లో సాఫ్ట్ టెన్నిస్‌లో భారత్‌కు తొలి పతకం అందుకున్న జై మీనా

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 24:ఆసియా క్రీడల్లో సాఫ్ట్ టెన్నిస్‌లో పురుషుల వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకం సాధించిన జై మీనాకు ప్రధాన మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. సాఫ్ట్ టెన్నిస్‌లో ఆసియా క్రీడల్లో భారత్‌కు తొలి పతకం అందించి, జై మీనా చరిత్ర సృష్టించాడు.

ఈ విజయం భారత క్రీడా రంగంలో కీలక అధ్యాయమని ప్రధానమంత్రి అన్నారు. జై మీనా సాధించిన ఈ విజయం ఎంతో మంది యువత సాఫ్ట్ టెన్నిస్‌ని ఎంచుకుని, రాణించేలా స్ఫూర్తినిస్తుందన్నారు. భవిష్యత్తులో అతను మరిన్ని విజయాలు సాధించాలని కాంక్షించారు.

సామాజిక మాధ్యమం 'ఎక్స్' లో ప్రధానమంత్రి కార్యాలయం ఇలా పేర్కొంది.

పురుషుల వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకం సాధించి, ఆసియా క్రీడల్లో సాఫ్ట్ టెన్నిస్‌లో భారత్‌కు తొలి పతకం అందించిన జై మీనాకు శుభాకాంక్షలు.

ఈ పతకం ఎంతో మంది యువత సాఫ్ట్ టెన్నిస్‌ని ఎంచుకుని, రాణించేలా స్ఫూర్తినిస్తుందన్నారు. భవిష్యత్తులో అతను మరిన్ని విజయాలు సాధించాలని కాంక్షిస్తున్నా"

# రాష్ట్రకవి రామ్‌ధారీ సింగ్ దినకర్ గారి జయంతి.. నివాళులు అర్పించిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24:రాష్ట్రకవి రామ్‌ధారీ సింగ్ దినకర్ గారి జయంతి ఈ రోజు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆయనకు నివాళులు అర్పించారు.

ఆయన శక్తిమంతమైన కవితల్లో ప్రజా చైతన్యంతో పాటు దేశాభిమాన భావోద్వేగాలు నిండి ఉంటాయనీ, అవి నేటికీ ప్రజల మనసులో శౌర్యం, తేజస్సు, ఆత్మగౌరవాన్ని నింపుతున్నాయనీ ప్రధానమంత్రి అన్నారు. ఆయన రచనలు సాహిత్యాన్ని సుసంపన్నం చేయడం మాత్రమే కాకుండా, మాతృభూమి పట్ల అంకితభావాన్ని కూడా కలిగిస్తున్నాయని ప్రధాని అన్నారు. ఆయన మహనీయ వ్యక్తిత్వం, కాల పరీక్షకు తట్టుకొని నిలిచిన ఆయన రచనలు తరాల తరబడి భారతీయులకు మార్గదర్శనం చేస్తూ ఉంటాయని శ్రీ నరేంద్ర మోదీ అన్నారు."రాష్ట్రకవి రాంధారీ సింగ్ దినకర్ గారి జయంతి సందర్భంగా ఆయనకు శత సహస్ర నమస్సులు. ప్రజాచైతన్యం, జాతీయ ఆత్మగౌరవ భావాలు ఉట్టిపడే ఆయన శక్తిమంతమైన కవితలు నేటికీ దేశ ప్రజల హృదయంలో శౌర్యాన్నీ, తేజాన్నీ, ఆత్మగౌరవాన్నీ నింపుతున్నాయి. ఆయన రచనలు సాహిత్యాన్ని సంపన్నం చేయడంతో పాటు మాతృభూమి పట్ల అంకితభావాన్ని పెంచుతున్నాయి.

# ఆయుష్మాన్ భారత్ ఎనిమిదో వార్షికోత్సవం.. పథకం విజయవంతంగా అమలవుతోందన్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24:ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం మొదలై ఇప్పటికి ఎనిమిది సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా, ఈ పథకం సాధించిన విజయాలను ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు ప్రస్తావించారు. భారతదేశంలో ప్రతి ఒక్కరికీ ఉన్నత నాణ్యత కలిగిన ఆరోగ్యసంరక్షణ సేవలను తక్కువ ఖర్చులో అందుబాటులోకి తీసుకురావాలన్న ఆలోచనతో ఈ పథకాన్ని ఎనిమిది సంవత్సరాల కిందట ప్రారంభించినట్లు ప్రధాన మంత్రి తెలిపారు. ప్రస్తుతం 6 కోట్ల కన్న ఎక్కువ మంది లబ్ధిదారులకు ఏటా రూ.5 లక్షల విలువైన ఆరోగ్య బీమా రక్షణ అందుతోందనీ, ఈ పథకం ప్రపంచంలో అతి పెద్ద ఆరోగ్య సంరక్షణ పథకంగా నిలిచిందనీ ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమం వైద్య ఖర్చుల్లో రికార్డు స్థాయి ఆదాకు తోడ్పడిందనీ, దీంతో పేదలతో పాటు మధ్య తరగతి ప్రజలకు కూడా ప్రయోజనం కలుగుతోందనీ శ్రీ మోదీ అన్నారు.ఆరోగ్యసంరక్షణ సేవలు ఇంటింటికీ చేరుతున్నాయని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. ప్రజలు ఇంతవరకు 500 కోట్ల కన్న ఎక్కువ సార్లు ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలకు వెళ్లారనీ, ఫలితంగా క్షేత్ర స్థాయిలో ప్రాథమిక ఆరోగ్య సేవలు బలోపేతం అవుతున్నాయనీ వివరించారు.

# కుటుంబ సమేతంగా వినాయకుడిని దర్శించుకున్న కలెక్టర్, ఎస్పీ.



సంగారెడ్డి, సెప్టెంబర్ 24(నేటినిజం ప్రతినిధి) వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గంజ్ మైదాన్ వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్ బుధవారం కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అసోసియేషన్ సభ్యులు కలెక్టర్, ఎస్పీతో పాటు నారాయణఖేడ్ డిప్యూటీ కలెక్టర్ ఉమా హారిక, అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు సుదీప్, హర్షవర్ధన్, మురారి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# గోదావరిలో స్నానానికి వెళ్లి యువకుడి మృతి

ఆదిలాబాద్, సెప్టెంబర్ 24: గణేష్ నిమజ్జనం అనంతరం గోదావరి నదిలో స్నానానికి వెళ్లిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందారు. బాసర ఎస్‌హెచ్‌ఓ దీపక్ తెలిపిన వివరాల ప్రకారం.. తానూరు మండలం ఎల్వి గ్రామానికి చెందిన లోకండే విశాల్ (..) గ్రామస్తులతో కలిసి గణేష్ నిమజ్జనం కోసం బాసర గోదావరికి వచ్చారు. నిమజ్జనం అనంతరం అందరూ కలిసి భోజనం చేసేందుకు సత్రానికి వెళ్లారు. ఈ క్రమంలో విశాల్ ఒక్కడే తిరిగి గోదావరి నదిలో స్నానం చేసేందుకు వెళ్లాడు. స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. స్థానిక గజ ఈతగాళ్ల గాలింపు చేపట్టి మృతదేహాన్ని వెలికితీశారు.

# ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి.

**బాధితులకు పరిహారం సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలి: రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య.**




సంగారెడ్డి, సెప్టెంబర్ 24 (నేటినిజం ప్రతినిధి) జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించి, బాధితులకు ప్రభుత్వం అందించే పరిహారం సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య జిల్లా యంత్రాంగానికి సూచించారు. ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరిగేలా రెవెన్యూ, పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.

గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్‌తో కలిసి పోలీసు, రెవెన్యూ, ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి సంక్షేమ శాఖలతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులతో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన భూ సమస్యలు, అట్రాసిటీ కేసులు, రోస్టర్ పాయింట్ల అమలు, బ్యాక్‌లాగ్ ఖాళీలు, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలు తదితర అంశాలపై శాఖల వారీగా సమీక్షించారు.

ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీలు, ఇతర అణగారిన వర్గాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. అట్రాసిటీ కేసుల్లో బాధితులకు త్వరితగతిన పరిహారం అందేలా చర్యలు చేపట్టాలని, అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన కేసుల పరిష్కారంపై కలెక్టర్, ఎస్పీలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

అట్రాసిటీ కేసుల దర్యాప్తు, విచారణలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని చైర్మన్ సూచించారు. సిద్దిపేటలో మొబైల్ కోర్టు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సత్యనారాయణకు సూచించారు. ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు వారి కోటా మేరకు ప్రాధాన్యత కల్పించాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీల హక్కులు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై వారికి విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. సివిల్ రైట్స్ డే కార్యక్రమాలకు అధికారులు, ప్రజలు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని అన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను ఆయా వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం మాత్రమే వినియోగించాలని, ఇతర అవసరాలకు మళ్లించరాదని చైర్మన్ స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు అందాల్సిన సంక్షేమ పథకాల అమలులో అధికారులు జాప్యం లేదా నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని అన్నారు.

జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, యూనిఫామ్స్, పుస్తకాలు, మౌలిక వసతులు, స్కాలర్‌షిప్‌లు, వసతి గృహాల మరమ్మతులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు అందుతున్న రైతు భరోసా, రైతు బీమా, పారిశుధ్య కార్మికులకు కల్పిస్తున్న సదుపాయాలపై ఆరా తీశారు.

అన్ని శాఖల్లో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, బ్యాక్‌లాగ్ ఖాళీల వివరాలను శాఖల వారీగా అడిగి తెలుసుకున్న చైర్మన్, బ్యాక్‌లాగ్ ఖాళీలను త్వరితగతిన భర్తీ చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను సూచించారు.

ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన భూ సమస్యలను పరిశీలించి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. జిల్లాలో శాశ్వత అంగన్‌వాడీ భవనాలు లేని కేంద్రాలకు స్థలాలను గుర్తించి, భవనాల నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు పంపాలని జిల్లా సంక్షేమ అధికారికి సూచించారు.

జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, భూ సేకరణలో అసైన్డ్ భూములు కోల్పోయిన ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లా పరిధిలో పరిష్కరించగలిగిన సమస్యలను సత్వరం పరిష్కరిస్తామని, కమిషన్ చైర్మన్ సూచనలు, సలహాలను అమలు చేస్తామని తెలిపారు.

జిల్లాలో అట్రాసిటీ కేసుల్లో 109 మంది బాధితులకు జనవరి 2026 నుంచి ఆగస్టు 31 వరకు రూ.1.70 కోట్ల పరిహారం అందించామని తెలిపారు. వీరిలో 88 మంది ఎస్సీలు, 21 మంది ఎస్టీలు ఉన్నారని వివరించారు. మరో 119 పెండింగ్ అట్రాసిటీ కేసులకు సంబంధించి పరిహారం చెల్లించేందుకు అవసరమైన రూ.1.82 కోట్ల నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ, జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకు నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల వివరాలను కమిషన్ చైర్మన్‌కు వివరించారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నిర్ణీత సమయంలోపు చార్జిషీట్లు దాఖలు చేస్తున్నట్లు తెలిపారు.

అనంతరం ఎస్సీ, ఎస్టీల నుంచి వివిధ సమస్యలపై రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య వినతులను స్వీకరించారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు జిల్లా శంకర్, రాంబాబు నాయక్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి రామేశ్వరి దేవి, జిల్లా అధికారు లు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# భారత్‌లోను, ప్రపంచవ్యాప్తంగాను 11వ ఆయుర్వేద దినోత్సవం... నాగ్‌పూర్‌లో ఘనంగా జాతీయ వేడుకలు

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 24:'ఆరోగ్యకరమైన రేపటి కోసం ఆయుర్వేదం' ప్రధాన ఇతివృత్తంగా.. 11వ ఆయుర్వేద దినోత్సవాన్ని భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉత్సాహంగా నిర్వహించారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో జాతీయ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయుష్ సేవల రంగానికి సంబంధించిన నివేదిక, 'ఆయుష్ విజన్ ? 2030' సహా పలు కీలక నివేదికలు, పత్రాలను ఈ కార్యక్రమంలో ఆవిష్కరించారు. సీసీఆర్ ఏఎస్ అగ్ని వెబ్ పోర్టల్‌ను కూడా ప్రారంభించారు. ఆరోగ్య సంరక్షణ, ప్రజారోగ్యంలో ఆయుర్వేదం పాత్రతో పాటు 2047 దిశగా ప్రణాళికపై వైజ్ఞానిక సదస్సులను కూడా ఈ కార్యక్రమంలో నిర్వహించారు.

గౌరవ ప్రధానమంత్రి సందేశాన్ని కార్యక్రమంలో చదివి వినిపించారు. సంప్రదాయంగా ఉన్న ఆయుర్వేదం నేడు విజ్ఞానం, ప్రామాణికత, ఆవిష్కరణల స్థాయికి చేరిందని, భవిష్యత్ తరాల ఆరోగ్యం, శ్రేయస్సులను కాపాడడంలో దోహదపడుతుందని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ తన సందేశంలో పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్త గుర్తింపును ఆయుర్వేదం సొంతం చేసుకుందన్నారు. ఆయుష్ వీసాతో విదేశీ పౌరులు భారత్‌లో ఆయుష్ విధానాల కింద చికిత్స పొందవచ్చన్నారు. 'శక్తి సాధన' సంకల్పాన్ని ప్రస్తావిస్తూ... వికసిత భారత్ దిశగా దేశం స్థిరంగా పయనిస్తోందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఆయుర్వేదంతో అనుబంధమున్న సంస్థలు, నిపుణులు, యువత ఈ సుసంపన్నమైన సంప్రదాయాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లి, ఆరోగ్యకరమైన, సమర్థమైన, బలమైన భారత్ నిర్మాణానికి దోహదపడతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

కేంద్ర ఆయుష్ శాఖ సహాయ (స్వతంత్ర హోదా), ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీ ప్రతాపరావు జాదవ్ వర్చువల్‌గా ఈ వేడుకలను ప్రారంభించారు. ఆయుష్ మంత్రిత్వశాఖ కార్యదర్శి (వైద్య) రాజేశ్ కొటేచా, కేంద్ర ఆయుర్వేద శాస్త్రాల పరిశోధన మండలి (సీసీఆర్ఏఎస్) డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ (వైద్య) రబీనారాయణ్ ఆచార్య, ఇతర విశిష్ట అతిథులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రసంగిస్తూ.. దేశ ఆరోగ్య దార్శనికతలో అత్యంత కీలకమైన అంశంగా ఆయుర్వేదాన్ని కేంద్ర మంత్రి శ్రీ ప్రతాపరావు జాదవ్ అభివర్ణించారు. "హాస్పిటల్ కాదు.. మన ఇల్లే ఆరోగ్యానికి ప్రధాన కేంద్రం. ఔషధాలు కాదు.. మన జీవనశైలే ఆరోగ్యానికి ఆధారం" అని ఆయన వ్యాఖ్యానించారు. "స్వస్థస్య స్వస్థ రక్షణం, ఆతురస్య వికార ప్రశమనమ్" అన్న సూత్రాన్ని ఉదాహరిస్తూ.. చికిత్సతో పాటు ఆరోగ్యాన్ని సంరక్షించుకోవడానికీ ఆయుర్వేదం ప్రాధాన్య మిస్తుందన్నారు. పెరుగుతున్న జీవనశైలి సంబంధిత ఆరోగ్య సమస్యల నేపథ్యంలో.. ఈ విధానం మరింత ప్రాసంగికంగా మారుతోందన్నారు.

సంప్రదాయ వైద్య రంగాన్ని అంతర్జాతీయీకరించడంలో భాగంగా... జామ్‌నగర్‌లోని డబ్ల్యూహెచ్‌వో అంతర్జాతీయ సంప్రదాయ ఔషధ కేంద్రం, ఐటీఆర్ఏ జామ్‌నగర్‌కు జాతీయ ప్రాధాన్యం కలిగిన సంస్థగా గుర్తింపు లభించడం, డబ్ల్యూహెచ్ఓ ఐసీడీ-11 వర్గీకరణలో ఆయుర్వేదం, సిద్ధ, యునానీలను చేర్చడం వంటివి కీలకమైన చర్యలుగా శ్రీ ప్రతాపరావు జాదవ్ పేర్కొన్నారు. విజ్ఞానంతో, ప్రమాణాలతో, ఆవిష్కరణలతో సంప్రదాయాన్ని అనుసంధానించాలని ఆయన పిలుపునిచ్చారు. కేవలం వార్షిక కార్యక్రమంగానే కాకుండా.. ఆరోగ్యకరమైన జీవనంపై ప్రజల్లో విస్తృత భాగస్వామ్యాన్ని పెంపొందించే దిశగా ఆయుర్వేద దినోత్సవాన్ని విస్తరించాలని ఆయన సూచించారు.

ఆయుర్వేద విజ్ఞానాన్ని వైజ్ఞానిక ఆధారాలతో, ప్రమాణాలతో, ఆవిష్కరణలతో, ప్రజారోగ్య ప్రయోజనాలతో అనుసంధానించడంపైనే ఆయుర్వేదం భవిత ఆధారపడి ఉంటుందని ఆయుష్ మంత్రిత్వశాఖ కార్యదర్శి రాజేశ్ కోటేచా స్పష్టం చేశారు. ఆయుర్వేదం, ఇతర ఆరోగ్య సంరక్షణ వ్యవస్థల మధ్య సహకారాన్ని ప్రోత్సహిస్తూ... పరిశోధన, నాణ్యత, భద్రత, ప్రామాణీకరణను బలోపేతం చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. జామ్‌నగర్‌లోని డబ్ల్యూహెచ్‌వో అంతర్జాతీయ సంప్రదాయ ఔషధ కేంద్రం, ఆయుష్ రీసెర్చ్ పోర్టల్‌లో 43,000కు పైగా పరిశోధన ప్రచురణలు, 200కు పైగా బీఐఎస్ ప్రమాణాలు, ఆయుష్ క్వాలిటీ మార్క్ వంటి కీలక పరిణామాలను ప్రధానంగా ప్రస్తావిస్తూ... ఆయుష్ వ్యవస్థలను మరింత శాస్త్రీయంగా, ప్రామాణికంగా, ప్రపంచవ్యాప్తంగా ప్రాసంగికంగా మార్చడమేనని ఈ ప్రయత్నాల లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

గోక్షుర (ట్రిబ్యులస్ టెరెస్ట్రిస్), చంద్రసుర (లెపిడియం సాటీవం)కు సంబంధించిన భద్రతా నివేదికలు, చర్మ వ్యాధుల చికిత్సకు సంబంధించి ప్రామాణిక చికిత్స మార్గదర్శకాలు, అలాగే ఆయుష్ సేవల రంగాన్ని అంచనా వేస్తూ ఆయుష్ సేవల రంగంపై 'అభివృద్ధి చెందిన దేశాల పరిశోధన, సమాచార సంస్థ (ఆర్ఐఎస్)' రూపొందించిన మొదటి నివేదికలను ఈ కార్యక్రమంలో ఆవిష్కరించారు.

భారత్‌లో ఆయుష్ సంబంధిత కార్యక్రమాల స్థితిగతులపై 'సంప్రదాయ దార్శనికత నుంచి అంతర్జాతీయ నేతృత్వం వరకు: ఆయుష్ విజన్ 2030' పేరుతో నివేదికను కూడా ఈ కార్యక్రమంలో ఆవిష్కరించారు. సీసీఆర్ ఏఎస్- అగ్ని అంచనా మాపన వెబ్ పోర్టల్‌ను కూడా ప్రారంభించారు. పరిశోధన, ప్రామాణీకరణ, ఆవిష్కరణలు, చికిత్సా పరమైన మార్గదర్శకాలు, ఆయుర్వేద పరిజ్ఞానాన్ని ఆచరణలోకి తెచ్చేలా వ్యవస్థాగత పరివర్తనపై ఈ కార్యక్రమాలు ప్రధానంగా దృష్టి సారిస్తాయి.

ఈ కార్యక్రమంలో భాగంగా అర్హత కలిగిన నాలుగు పరిశ్రమలకు ఆయుష్ నాణ్యతా మార్కు ధ్రువీకరణలను ఆయుష్ మంత్రిత్వశాఖ కార్యదర్శి అందించారు. ఆయుష్ రంగంలో నాణ్యత, ప్రామాణీకరణలకు గల ప్రాధాన్యాన్ని ఇది స్పష్టం చేస్తోంది.

ఆరోగ్య రక్షణ, ప్రజారోగ్యంలో పెరుగుతున్న ఆయుర్వేదం పాత్రపై రెండు వైజ్ఞానిక సదస్సులను ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించారు. 'శాశ్వతం నుంచి విశ్వాసం దిశగా – ఆరోగ్యకరమైన రేపటి కోసం ఆయుర్వేదం, 2047కు ప్రణాళిక' పేరిట నిర్వహించిన మొదటి సదస్సులో డబ్ల్యూహెచ్‌వో జామ్‌నగర్ అంతర్జాతీయ సంప్రదాయ ఔషధ కేంద్రం యూనిట్ అధిపతి డాక్టర్ జి. గీతాకృష్ణన్ పిళ్లై పాల్గొన్నారు. ఆయుర్వేద రంగం భవిష్యత్తు గమనం, ప్రామాణీకరణ, 2047 నాటికి విస్తృత ఆరోగ్య లక్ష్యాల సాధనలో దాని పాత్రపై ఈ సదస్సులో ప్రధానంగా చర్చించారు. '2027 నాటికి అసాంక్రామిక వ్యాధుల భారాన్ని తగ్గించడంలో సమీకృత చికిత్సల ఆవశ్యకత' పేరుతో నిర్వహించిన రెండో సదస్సులో కాలేయ, బైలరీ విజ్ఞాన సంస్థ (ఐఎల్‌బీఎస్) డైరెక్టర్ డాక్టర్ శివకుమార్ సరీన్ పాల్గొన్నారు. పెరుగుతున్న అసాంక్రామిక వ్యాధుల భారాన్ని తగ్గించడంలో సమీకృత చికిత్సా విధానాల సామర్థ్యంపై ఈ సదస్సులో చర్చించారు.

వైజ్ఞానిక చర్చల అనంతరం.. జైపూర్‌లోని జాతీయ ఆయుర్వేద సంస్థ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సంజీవ్ వర్మ చర్చల సారాంశాన్ని వివరించారు. డిజైన్లు, ట్రేడ్ మార్కుల పేటెంట్ల కంట్రోలర్ జనరల్ ప్రొఫెసర్ డాక్టర్ ఉన్నత్ పి. పండిట్ కూడా 'దేశంలో ఆయుష్ సంబంధిత కార్యక్రమాలపై నివేదిక'పై ప్రసంగించారు. ప్రామాణిక చికిత్సా మార్గదర్శకాలపై ఆయుష్ మంత్రిత్వశాఖ సలహాదారు (ఆయుర్వేద) డాక్టర్ ఎ. రఘు మాట్లాడారు.

ఆయుష్ మంత్రిత్వశాఖ సీనియర్ గణాంక సలహాదారు శ్రీ సత్యజిత్ పాల్, అభివృద్ధి చెందుతున్న దేశాల కోసం పరిశోధన, సమాచార వ్యవస్థల (ఆర్ఐఎస్) డైరెక్టర్ జనరల్ సచిన్ కుమార్ శర్మ, మంత్రిత్వశాఖ సీనియర్ అధికారులు, ఆయుష్ కౌన్సిళ్లు, సంస్థల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జాతీయ ఔషధ మొక్కల ప్రదర్శనను కూడా వేదిక వద్ద ఏర్పాటు చేశారు. ఆయుష్ మంత్రిత్వశాఖ పరిధిలోని జాతీయ సంస్థల స్టాళ్లు ఈ ప్రదర్శనలో భాగంగా ఉన్నాయి. ఇది వీక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. నాగ్‌పూర్‌లో నిర్వహించిన ఈ జాతీయ వేడుకలో... దేశవ్యాప్తంగా ఉన్న అభ్యాసకులు, పరిశోధకులు, శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, సంస్థలు, సంబంధిత భాగస్వామ్య పక్షాల ప్రతినిధులు ఒకే వేదికపైకి వచ్చారు. ఆయుర్వేద పురోగతిలో ప్రామాణికత, పరిశోధన, ఆవిష్కరణ, నాణ్యత, సంపూర్ణ ఆరోగ్య రక్షణలకు పెరుగుతున్న ప్రాధాన్యాన్ని చాటేలా కార్యక్రమం సాగింది.

# ప్రధానమంత్రికి వచ్చిన జ్ఞాపికల ఈ - వేలం : 65 జ్ఞాపికల్లో ప్రతిబింబించిన బిహార్ వారసత్వం, జానపద సంప్రదాయాలు, ఆధ్యాత్మిక వైభవం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24: వివిధ సందర్భాల్లో ప్రధానమంత్రికి వచ్చిన జ్ఞాపికల ఈ - వేలం (2026)లో ప్రదర్శించిన 65 జ్ఞాపికల సేకరణలో బిహార్ సాంస్కృతిక వైభవం ప్రతిబింబించింది. జానపద కళలు, హస్తకళలు, ఆధ్యాత్మికత, చరిత్ర, వారసత్వానికి సంబంధించిన రాష్ట్ర వైవిధ్యభరిత సంప్రదాయాలను ఈ సేకరణలో పొందుపరిచారు. సున్నితమైన కళాత్మకతతో రూపొందించిన మధుబని చిత్రాలు, సిక్కి హస్తకళలు మొదలుకొని ప్రసిద్ధ ఆలయాలు, చారిత్రక ప్రముఖులు, జాతీయ చిహ్నాల ప్రతిరూపాల వరకు ఈ సేకరణ విస్తరించింది.

మిథిలా/మధుబని చిత్రకళా సంప్రదాయానికి ఈ సేకరణలో విశేష స్థానం ఉంది. ఇందులో రామ్ సీతా వివాహం, రామ్ దర్బార్, ఛఠ్ పూజ, దశ మహావిద్యలు, పవిత్ర యంత్రాల చిత్రణలతో పాటు, రామాయణాన్ని ప్రతిబింబించే కచ్ని శైలిలో రూపొందించిన మధుబని కళాఖండం కూడా ఉన్నాయి. మిథిలా సంప్రదాయంలోని తలపాగాలు కూడా ఈ సేకరణలో అనేకం ఉన్నాయి. చేపలు, తామర పువ్వులు వంటి సంప్రదాయ ఆకృతులతో వీటిని చేతితో చిత్రించారు. మిథిలా ప్రాంతానికి ప్రత్యేకమైన తలపాగాగా పాగ్ ప్రసిద్ధి చెందింది. దీనిని విభిన్న ఆకృతులు, డిజైన్లలో ఈ సేకరణలో ప్రదర్శించారు. బిహార్ హస్తకళా వారసత్వాన్ని సిక్కి గడ్డి కళ కూడా ప్రతిబింబిస్తోంది. ఇందులో భారత కొత్త పార్లమెంట్ భవనం నమూనాతో పాటు, కోస్టర్లు అమర్చిన సంప్రదాయ సిక్కి అల్లిక బుట్ట కూడా ఉన్నాయి. వెదురు చేటపై చేతితో చిత్రించిన మధుబని కళాఖండం జానపద చిత్రకళను సంప్రదాయ వినియోగ హస్తకళతో మేళవించింది.

# సహజసిద్ధ వాతావరణాన్ని పరిరక్షిస్తూ మల్లూరు ఆలయాన్ని అభివృద్ధి చేయాలి

**ఆలయ విశిష్టత, స్వామివారి గొప్పతనం ప్రతిబింబించేలా మాస్టర్ ప్లాన్.**

**భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి.**

**రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క.**



ములుగు, సెప్టెంబర్ 24:(నేటినిజం ప్రతినిధి): మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి ఆలయ పరిసరాల్లోని సహజసిద్ధ వాతావరణాన్ని పరిరక్షిస్తూ, క్షేత్ర విశిష్టత ప్రతిబింబించేలా సమగ్ర అభివృద్ధి ప్రణాళికలను రూపొందిస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు.

గురువారం మంగపేట మండలం మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి వారిని మంత్రి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తో కలిసి దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అనంతరం ఆలయ అభివృద్ధి, మాస్టర్ ప్లాన్, చేపట్టాల్సిన పనులపై జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, దేవాదాయ శాఖ అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి పనులతో ఎవరికీ నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మల్లూరు క్షేత్రంలోని దట్టమైన అడవులు, వందల ఏళ్ల నాటి వృక్షాలు, స్వచ్ఛమైన గాలి, సహజ జలవనరులతో కూడిన ఆహ్లాదకర వాతావరణంఎంతో అరుదైనదని పేర్కొన్నారు. ఇటువంటిప్రకృతి సంపదను కొత్తగా నిర్మించలేమని, ఎంత ఖర్చు చేసినా కొనుగోలు చేయలేమని తెలిపారు.

ఆలయ పరిసరాల్లోని సహజత్వానికి ఎలాంటి విఘాతం కలగకుండా అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. భక్తుల అవసరాలు, భవిష్యత్తులో పెరిగే రద్దీని దృష్టిలో ఉంచుకుని తాగునీరు, పారిశుద్ధ్యం, విశ్రాంతి ప్రదేశాలు, వాహనాల నిలుపుదల, రాకపోకలకు అనువైన మార్గాలు వంటి సౌకర్యాలకు మాస్టర్ ప్లాన్‌లో ప్రాధాన్యం చేస్తున్నట్లు తెలిపారు.

ఆలయ చరిత్ర, పురాణ నేపథ్యం, స్వామివారి విశిష్టతను భక్తులకు తెలియజేసేలా ఆకర్షణీయమైన శిల్పాలు, విగ్రహాలు ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. క్షేత్ర గొప్పతనం ప్రతి ఒక్కరికీ అర్థమయ్యేలా ఆధ్యాత్మికత ఉట్టిపడే విధంగా మాస్టర్ ప్లాన్‌ను అద్భుతంగా ఆవిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ప్రకృతి సంపదను కాపాడుతూనే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి, మల్లూరు క్షేత్రాన్ని ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ఆలయ మండపం విస్తరణ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని, భక్తుల సౌకర్యార్థం వసతి గదులు, కల్యాణ మండపం, ఇతర మౌలిక సదుపాయాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలని ఆదేశించారు.

అంతకుముందు ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించనున్న గోశాలకు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి మంత్రి సీతక్క భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనా, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, ఆలయ ఈ ఓ వీరస్వామి, తహసిల్దార్ రవీందర్, స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు సుశాంత్ ఎంపిక

ఆదిలాబాద్, సెప్టెంబర్ 24: బెల్లంపల్లిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)లో 9వ తరగతి చదువుతున్న గజ్జల సుశాంత్ జాతీయ స్థాయి సబ్-జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. గురువారం సీఓఈలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆకిడి విజయసాగర్ సుశాంత్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఇటీవల బెల్లంపల్లి తిలక్ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో సుశాంత్ అద్భుత ప్రతిభ కనబరిచి మంచిర్యాల జిల్లా జట్టు విజేతగా నిలవడంలో కీలకపాత్ర పోషించాడని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.



# బంగారం అక్రమ రవాణాపై డీఆర్ఐ మెరుపు దాడులు..

## రూ.32 కోట్ల విలువైన సుమారు 21 కిలోల విదేశీ బంగారం స్వాధీనం

బంగారం అక్రమ రవాణాపై రెవెన్యూ ఇంటెలిజెన్స్ డైరెక్టరేట్ (డీఆర్ఐ) నిరంతరంగా దాడులు కొనసాగిస్తుంది. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా ఏడు వేర్వేరు ఆపరేషన్లు నిర్వహించగా.. రెండు ఆపరేషన్లలో సుమారు 21 కిలోల విదేశీ మూలాలున్న బంగారాన్ని స్వాధీనం చేసుకుంది. ఈ బంగారం మొత్తం విలువ రూ.61 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. కస్టమ్స్ చట్టం 1962లోని నిబంధనల కింద అయిదుగురిని అరెస్టు చేశారు.

పక్కా సమాచారం ఆధారంగా డీఆర్ఐ అధికారులు పాల్వాల్ టోల్ ప్లాజా సమీపంలో రెండు కొత్త థార్ వాహనాలను అడ్డుకున్నారు. రెండు వాహనాల చాసిస్‌లో అత్యంత చాకచక్యంగా, అధునాతన పద్ధతిలో రహస్య అరలను ఏర్పాటు చేశారు. వెనుక చక్రం పైభాగంలో చాసిస్‌లోని కొంత భాగాన్ని తొలగించి, అందులో రహస్య అరను ఏర్పాటు చేసిన అనంతరం తిరిగి నైపుణ్యంతో వెల్డింగ్ చేయడంతో ఈ అరను గుర్తించడం అత్యంత కష్టంగా మారింది. ఈ వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం డీఆర్ఐ అధికారులు రహస్య అరను విజయవంతంగా గుర్తించగలిగారు. రెండు వాహనాల నుంచి మొత్తం 15.18 కిలోల బంగారు కడ్డీలు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.23.30 కోట్లు ఉంటుంది. వాహనాలతో పాటు ఉన్న నలుగురిని అరెస్టు చేశారు. ఈ బంగారాన్ని మయన్మార్ నుంచి అక్రమంగా రవాణా చేసినట్లు తెలుస్తోంది.

అంతకుముందు 16.09.2026న నిర్వహించిన మరో ఆపరేషన్‌లో డీఆర్ఐ అధికారులు జేవర్ టోల్ ప్లాజా వద్ద గోరఖ్‌పూర్ నుంచి ఢిల్లీకి బస్సులో ప్రయాణిస్తున్న ఒక ప్రయాణికుడిని అడ్డుకున్నారు. అతడిని వ్యక్తిగతంగా తనిఖీ చేయగా, ప్రత్యేకంగా రూపొందించిన కాటన్ నడుము బెల్ట్‌లో దాచిన 5.8 కిలోల విదేశీ మూలాలున్న బంగారం లభించింది. ఇందులో ఒక్కొక్కటి కిలో బరువున్న అయిదు బంగారు కడ్డీలు, సుమారు 800 గ్రాముల బంగారు ముక్కలు ఉన్నాయి. ఈ బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. కస్టమ్స్ చట్టం 1962 కింద ఆ వ్యక్తిని అరెస్టు చేశారు. ప్రాథమిక దర్యాప్తులో ఈ బంగారాన్ని ఖాట్మండులో అతడికి అప్పగించి, భారత్?నేపాల్ భూ సరిహద్దు ద్వారా భారత్‌లోకి తీసుకువచ్చినట్లు వెల్లడైంది.

గత మూడు వారాల్లో దేశవ్యాప్తంగా నిర్వహించిన వివిధ ఆపరేషన్లలో డీఆర్ఐ అధికారులు సుమారు 123 కిలోల బంగారం, సుమారు 10 కిలోల వెండి స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ రూ.187 కోట్లకు పైగా ఉంటుంది. బంగారం అక్రమ రవాణాకు సంబంధించి 58 మందిని అరెస్టు చేశారు. ఈ ఆపరేషన్లు వ్యవస్థీకృత బంగారం అక్రమ రవాణా వ్యవస్థలను ఛేదించడంతో పాటు, మరింత అధునాతనంగా అనుసరిస్తున్న దాచే పద్ధతులను గుర్తించడంపై డీఆర్ఐ నిరంతరం దృష్టి సారిస్తున్నదనడానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.

# ఆత్మనిర్భర్ భారత్‌కు మరింత ఊతం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24: భారత వైమానిక దళం (ఐఏఎఫ్) కోసం 160 శాటిలైట్ స్మార్ట్ యాంటీ ఎయిర్‌ఫీల్డ్ ఆయుధాలు (ఎస్ఏటీ-ఎస్ఏఏడబ్ల్యూ), సంబంధిత పరికరాలను కొనుగోలు చేయటానికి భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్)తో రక్షణ మంత్రిత్వ శాఖ ఒప్పందం కుదుర్చుకుంది. బై (ఇండియన్-స్వదేశీ రూపకల్పన, అభివృద్ధి, తయారీ) కేటగిరి ద్వారా కుదిరిన ఈ ఒప్పందం విలువ రూ. 810.79 కోట్లు. సెప్టెంబర్ 23, 2026న రక్షణ కార్యదర్శి శ్రీ రాజేశ్ కుమార్ సింగ్ సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది.

జాగ్వార్, హాక్, సు-30 ఎంకెఐ వంటి వాటి ద్వారా ప్రయోగించగల ఎస్ఏటీ- స్ఏ ఏడబ్ల్యూ- గగనతలం నుంచి భూమి ఉపరితలం పైకి ప్రయోగించే ఖచ్చితమైన గ్లైడ్ బాంబ్. ఇది సుదూర ప్రాంతాల నుంచే శత్రువుల వైమానిక స్థావరాలను నిర్వీర్యం చేయగల సామర్థ్యం కలది. డీఆర్‌డీఓ దేశీయంగా రూపొందించి, అభివృద్ధి చేసిన ఈ వ్యవస్థలో 60 శాతం స్వదేశీ పరికరాలుంటాయి. రక్షణ రంగంలో ఆత్మనిర్భరతను మరింత పెంపొందించేందుకు ఇనిషియల్ మెజర్‌మెంట్ యూనిట్, లాంగ్ ఇంపాక్ట్ డిలే ఫ్యూజ్, ట్విన్ స్టోర్ క్యారియర్ వంటి ఉప-వ్యవస్థలను దేశీయంగా అభివృద్ధి చేశారు.

ఎస్ఏటీ-ఎస్ఏఏడబ్ల్యూను 2027-2028, 2028-2029 మధ్య కాలంలో ప్రవేశపెట్టాల్సి ఉంది. దీనిద్వారా ఐఏఎఫ్ ఎలాంటి అంతరాయం లేకుండా ఆపరేషన్లను కొనసాగించే కార్యచరణ సామర్థ్యం ఖచ్చితంగా మెరుగుపడుతుంది. దేశ రక్షణ రంగ సన్నద్ధతను ఇది బలోపేతం చేస్తుంది.

# అంతర్రాష్ట్ర సరిహద్దుల మీదుగా బంగ్లాదేశ్ నుంచి బంగారం అక్రమ రవాణాను అడ్డుకున్న

## డీఆర్ఐ - రూ.17 కోట్ల విలువైన సుమారు 12 కిలోల విదేశీ బంగారం స్వాధీనం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24:అంతర్జాతీయ సరిహద్దుల గుండా బంగారం అక్రమ రవాణాపై డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) చేపట్టిన ముమ్మర దాడుల్లో భాగంగా, బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్)తో సమన్వయంతో భారత్ - బంగ్లాదేశ్ సరిహద్దు మీదుగా అక్రమంగా తరలిస్తున్న విదేశీ మూలాల బంగారాన్ని, పలు సరుకులను అధికారులు అడ్డుకున్నారు. పశ్చిమ బెంగాల్, బీహార్‌లో వరుసగా నిర్వహించిన తనిఖీలు, దాడుల్లో సరిహద్దు ప్రాంతాల్లోని పలు ప్రదేశాలతో పాటు ఒక రైలు ప్రయాణికుడి నుంచి మొత్తం సుమారు 12 కిలోల విదేశీ బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.17 కోట్లు ఉంటుందని అంచనా. దేశంలోకి బంగారాన్ని రహస్యంగా తరలించేందుకు బంగ్లాదేశ్ మార్గాన్ని అక్రమ రవాణాదారులు ఇప్పటికీ ఉపయోగిస్తున్నట్లు వెల్లడైంది.

2026 సెప్టెంబర్ 20 - 21 తేదీల్లో పశ్చిమ బెంగాల్‌లో 161 బెటాలియన్‌కు చెందిన బీఎస్ఎఫ్ సిబ్బంది బీఓపీ గోంగ్రా పరిధిలోని భారత్ - బంగ్లాదేశ్ సరిహద్దు రహదారి సమీపంలో ఎవరికీ చెందని స్థితిలో ఉన్న 27 విదేశీ మూలాల అక్రమ రవాణా బంగారం ముక్కలను గుర్తించారు. వీటి మొత్తం బరువు సుమారు 3.15 కిలోలు. అనంతరం డీఆర్ఐ అధికారులు తదుపరి చర్యలు చేపట్టి, 1962 కస్టమ్స్ చట్టంలోని నిబంధనల ప్రకారం ఆ బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు.

మరో ఆపరేషన్‌లో భాగంగా 2026 సెప్టెంబర్ 21న బీఎస్ఎఫ్ 161 బెటాలియన్‌కు చెందిన సిబ్బంది బీఓపీ మహాఖోలా పరిధిలో భారత్ - బంగ్లాదేశ్ సరిహద్దు కంచెకు అవతల ఉన్న హాత్‌ఖోలా గ్రామంలో హ్యాండ్‌పంప్ సమీపంలో దాచిన 24 క్యారెట్ల విదేశీ మూలాల అక్రమ రవాణా బంగారాన్ని గుర్తించారు. మొత్తం 10 ముక్కలుగా ఉన్న ఈ బంగారం సుమారు 1.16 కిలోల బరువు ఉంది. అనంతరం డీఆర్ఐ అధికారులు ఆ బంగారాన్ని 1962 కస్టమ్స్ చట్టంలోని సెక్షన్ 110 నిబంధనల ప్రకారం స్వాధీనం చేసుకున్నారు. అంతకుముందు 2026 సెప్టెంబర్ 10 - 11 తేదీల్లో బీఎస్ఎఫ్ సిబ్బంది బీఓపీ పాథర్‌ఘాటా పరిధిలో భారత్ - బంగ్లాదేశ్ సరిహద్దు కంచె సమీపంలో 48 బంగారు బార్లను గుర్తించారు. వీటి మొత్తం బరువు సుమారు 5.9 కిలోలు. అనంతరం ఈ బంగారాన్ని కూడా డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

పాట్నాలో డీఆర్ఐ అధికారలు ఒక రైలు ప్రయాణికుడి నుంచి విదేశీ మూలాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. 15 బంగారు బార్లు, నాలుగు చిన్న బంగారు ముక్కల రూపంలో ఉన్న ఈ బంగారం మొత్తం సుమారు 1.71 కిలోల బరువు ఉంది. నిందితుడు రెండు కాళ్లకు చుట్టుకున్న వస్త్రంతో తయారు చేసిన వెూకాలి కవచంలో బంగారాన్ని దాచిపెట్టి తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. దర్యాప్తులో ఈ బంగారం బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా తరలించినట్లు తేలింది. ఆ వ్యక్తిని అరెస్టు చేశారు.

బంగ్లాదేశ్ మార్గం ద్వారా విదేశీ మూలాల బంగారం అక్రమ రవాణా, తరలింపు, పంపిణీ వెనుక ఉన్న ముఠాలను అడ్డుకునేందుకు బీఎస్ఎఫ్ సన్నిహిత సమన్వయంతో డీఆర్ఐ నిరంతరం చర్యలు చేపడుతున్నట్లు ఈ ఆపరేషన్లు వెల్లడిస్తున్నాయి.

# జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు సుశాంత్ ఎంపిక




ఆదిలాబాద్, సెప్టెంబర్ 24: బెల్లంపల్లిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)లో 9వ తరగతి చదువుతున్న గజ్జల సుశాంత్ జాతీయ స్థాయి సబ్-జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. గురువారం సీఓఈలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆకిడి విజయసాగర్ సుశాంత్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఇటీవల బెల్లంపల్లి తిలక్ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో సుశాంత్ అద్భుత ప్రతిభ కనబరిచి మంచిర్యాల జిల్లా జట్టు విజేతగా నిలవడంలో కీలకపాత్ర పోషించాడని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

ఈ ప్రతిభ ఆధారంగా తెలంగాణ జట్టు తరఫున ఈ నెల 25 నుంచి 27 వరకు మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో నిర్వహించనున్న జాతీయ పోటీలకు ఎంపికయ్యాడని తెలిపారు. సీఓఈ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తూ జాతీయ స్థాయికి ఎంపికవుతుండటం గర్వకారణమన్నారు. సుశాంత్ జాతీయ స్థాయిలోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. గురుకులాల జోనల్ అధికారి శారద సైతం సుశాంత్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ తన్నీరు గోపి, ఉపాధ్యాయులు విజయ్, మల్లికార్జున్, మోహన్, ప్రేమలత, హారిక, స్రవంతి, పీఈటీలు అల్లూరి వామన్, ముచ్చకుర్తి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# బెల్లంపల్లిలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ బైక్ ర్యాలీ

ఆదిలాబాద్, సెప్టెంబర్ 24: నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా సాగిన యువత పోరాటం విజయవంతం కావడాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో గురువారం బెల్లంపల్లి పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్టీ మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రాంటెంకి నేతృత్వంలో పట్టణ పురవీధుల్లో ఈ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువత ఐక్య పోరాటంతోనే కేంద్రం దిగివచ్చిందని, యువత తలచుకుంటే దేశ రాజకీయాలనే శాసించగలరని పేర్కొన్నారు. 'యూత్ పవర్ ఈస్ నేషనల్ పవర్' నినాదాలతో యువత కదంతొక్కాలని పిలుపునిచ్చారు. ర్యాలీలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బెల్లంపల్లిలో పోరాటయోధుడు పోతుగంటి పోశెట్టి నివాళి గీతం ఆవిష్కరణ




ఆదిలాబాద్, సెప్టెంబర్ 24:: స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ సాయుధ పోరాట వీరుడు పోతుగంటి పోశెట్టి 45వ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన నివాళి గీతాన్ని ఆవిష్కరించారు. పోశెట్టి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన కుమారుడు పోతుగంటి అశోక్ గీతావిష్కరణ చేశారు.

ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ? బెల్లంపల్లిలో కమ్యూనిస్టు పార్టీకి బలమైన పునాది వేసి, కంచుకోటలా తీర్చిదిద్దడంలో పోశెట్టి పోషించిన పాత్ర చిరస్మరణీయమన్నారు. ఆసిఫాబాద్ సమితి అధ్యక్ష, ఉపాధ్యక్షుడిగా, చాకేపల్లి సర్పంచ్‌గా నాలుగుసార్లు ఏకగ్రీవంగా ఎన్నికై ప్రజా నాయకుడిగా ప్రజల హృదయాల్లో నిలిచి పోయారని కొనియాడారు.పోశెట్టి పోరాట స్ఫూర్తిని భావితరాలకు పరిచయం చేసేందుకే ఈ గీతాన్ని రూపొందించినట్లు ఆయన మనవడు, రచయిత పోతుగంటి భరత్ రుషి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి మిట్టపల్లి వెంకటస్వామి, పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి, సహాయ కార్యదర్శి బొల్లం తిలక్ అంబేద్కర్, తాండూరు మండల కార్యదర్శి కొండు బానేష్, నాయకులు గుండా చంద్రమాణిక్యం, అక్కేపల్లి బాపు, దాసరి తిరుపతిగౌడ్, బొంకురి రామచందర్, స్వామిదాస్, ఇనుముల రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ఐఎన్ఎల్ భూముల ఈ - వేలానికి ముందస్తుగా విశాఖపట్నంలో పెట్టుబడిదారుల సమావేశం నిర్వహించిన ఎన్ఎల్ఎంసీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24: విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ కార్పొరేట్ సంస్థ - రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్)కు చెందిన 459 ప్లాట్ల ఈ - వేలం గురించి ఆసక్తి ఉన్న బిడ్డర్లకు, భాగస్వామ్య వర్గాలకు వివరాలు అందించేందుకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థల విభాగం (డీపీఈ) ఆధ్వర్యంలో పనిచేస్తున్న నేషనల్ ల్యాండ్ మానిటైజేషన్ కార్పొరేషన్ (ఎన్ఎల్ఎంసీ) ఈ రోజు విశాఖపట్నంలో పెట్టుబడిదారుల సమావేశాన్ని నిర్వహించింది.

ఎన్ఎల్ఎంసీ, ఆర్ఐ ఎన్ఎల్‌కు చెందిన ఉన్నతాధికారులు పెట్టుబడిదారుల సమావేశానికి హాజరయ్యారు. ఆసక్తి ఉన్న పెట్టుబడిదారులు, డెవలపర్లు, ఇతర భాగస్వామ్య వర్గాలు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. భూముల వివరాలు, ప్లాట్ల ప్రాంతం, స్థానం, ప్రత్యేకతలు, ఈ - వేలం ప్రక్రియ, అర్హత నిబంధనలు, రిజిస్ట్రేషన్ విధానం, ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (ఈఎండీ), ఇంకా వర్తించే ఇతర నిబంధనలు, షరతులపై సమగ్ర సమాచారాన్ని పంచుకునేందుకు ఈ సమావేశం అవకాశం కల్పించింది.

ఈ - వేలానికి ముందు ఎన్ఎల్ఎంసీ నిర్వహిస్తున్న పెట్టుబడిదారుల అవగాహన కార్యక్రమంలో భాగంగా ఈ పెట్టుబడిదారుల సమావేశం జరిగింది. సమాచారాన్ని విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, ఆసక్తి ఉన్న బిడ్డర్లు భూముల వివరాలు గురించి, వేలం ప్రక్రియ గురించి సమగ్రంగా అర్థం చేసుకునేలా చేయడం ఈ కార్యక్రమం లక్ష్యం. ఈ అవగాహన కార్యక్రమంలో భాగంగా 2026 సెప్టెంబర్ 24న విజయవాడలో, 2026 సెప్టెంబర్ 25న హైదరాబాద్‌లో పెట్టుబడిదారుల సమావేశాలు నిర్వహించనున్నారు.

ఈ - వేలంలో విశాఖపట్నంలోని హెచ్‌బీ కాలనీ, మద్దిలపాలెం, ఆటోనగర్, గాజువాక ప్రాంతాల్లో ఉన్న ఆర్ఐఎన్ఎల్‌కు చెందిన మొత్తం 93,572.21 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న 459 ప్లాట్లు ఉన్నాయి. ఒక్కో ప్లాట్ విస్తీర్ణం సుమారు 128.94 చదరపు గజాల నుంచి 2,728 చదరపు గజాల వరకు ఉంది.

ఈ భూముల్లో హెచ్‌బీ కాలనీలో సుమారు 87,949.77 చదరపు గజాల విస్తీర్ణంలో 456 నివాస ప్లాట్లు, ఆటోనగర్, గాజువాకలో సుమారు 5,622.44 చదరపు గజాల విస్తీర్ణంలో మూడు ప్లాట్లు ఉన్నాయి. విశాఖపట్నంలో ఇప్పటికే అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో ఈ ప్లాట్లు ఉండటంతో ప్రస్తుతం అందుబాటులో ఉన్న రహదారి, పౌర మౌలిక సదుపాయాలను వినియోగించుకునే అవకాశం ఉంది.

ఆటోనగర్‌లోని భూముల్లో బ్లాక్ - 2లో 2,728 చదరపు గజాల విస్తీర్ణంలో ఒకే ప్లాట్, బ్లాక్ - 3లో మొత్తం సుమారు 2,894.44 చదరపు గజాల విస్తీర్ణంలో రెండు నివాస ప్లాట్లు ఉన్నాయి. ఆటోనగర్‌లో ఇప్పటికే వాణిజ్య, పారిశ్రామిక కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. నగరంలోని ఇతర ప్రాంతాలతో పాటు పరిసర ప్రాంతాలకు రహదారి అనుసంధానం కూడా ఉంది.

ఈ - వేలం ప్రక్రియకు లావాదేవీ సలహాదారుగా క్వికర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (క్యుఐపీఎల్) ను నియమించారు.

ఎన్ఎల్ఎంసీ సీఈఓ శ్రీ రోహన్ చంద్ ఠాకూర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, "ఆర్ఐఎన్ఎల్ భూముల ఈ - వేలానికి ముందు నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమంలో విశాఖపట్నం పెట్టుబడిదారుల సమావేశం ఒక ముఖ్యమైన భాగం. ఆసక్తి ఉన్న బిడ్డర్లకు భూముల వివరాలు, ఈ -వేలం ప్రక్రియ, నిబంధనలు, షరతులపై సమగ్ర సమాచారం అందుబాటులో ఉండేలా చూడడమే మా లక్ష్యం. విశాఖపట్నంలో ఇప్పటికే అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో 93,500 చదరపు గజాలకు పైగా విస్తీర్ణంలో 459 ప్లాట్లు అందుబాటులో ఉన్నాయి.

# నవా షెవా ఓడరేవులో రూ. 3 కోట్ల విలువైన 10,000 కిలోల బాణసంచా స్వాధీనం చేసుకున్న డీఆర్ఐ

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 24:విశ్వసనీయ సమాచారంతో డీఆర్ఐ అధికారులు నవా షెవా ఓడరేవులో నిర్వహించిన సోదాల్లో అక్రమంగా దిగుమతి అవుతున్న సరుకును గుర్తించారు. బాణసంచా ఉందనే అనుమానంతో తనిఖీ చేయగా... "సీసాలు, వాల్‌పేపర్లు"గా పేర్కొన్న సరుకు ముసుగులో రహస్యంగా దాచిన బాణసంచాను వారు గుర్తించారు.

పూర్తిస్థాయి తనిఖీల్లో సుమారు రూ.3 కోట్ల మార్కెట్ విలువ గల 19,800 బాణసంచా సామాగ్రిని (వీటిని 288 గాట్లింగ్ అంటారు) గుర్తించారు. వీటి బరువు దాదాపు 10,000 కేజీలు. కంటైనర్ ముందు భాగంలోని మొదటి మూడు వరుసల్లో మాత్రమే వారు చెప్పిన వస్తువులు (సీసాలు) ఉండగా, మిగిలిన కంటైనర్ మొత్తం బాణసంచాతో నింపేసారు. ఈ బాణసంచాతో పాటు, దానిని దాచడానికి వాడిన మిగిలిన వస్తువులనూ కస్టమ్స్ చట్టం-1962 ప్రకారం అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

విదేశీ వాణిజ్య విధానం ప్రకారం బాణసంచాను భారత్‌లోకి దిగుమతి చేసుకోవడంపై ఆంక్షలు ఉన్నాయి. దీని కోసం డీజీఎఫ్‌టీ నుంచి సరైన అనుమతి పత్రం, ఎక్స్‌ప్లోజివ్స్ నియమాలు-2008 ప్రకారం 'పెట్రోలియం అండ్ ఎక్స్‌ప్లోజివ్స్ సేఫ్టీ ఆర్గనైజేషన్' (పీఈఎస్‌వో) నుంచి తప్పనిసరిగా లైసెన్స్ పొందాల్సి ఉంటుంది.

ఈ కేసు దర్యాప్తులో భాగంగా, అధికారుల కళ్లు గప్పి రహస్యంగా ఆ సరుకును బయటకు తీసుకురావడానికి ప్రయత్నించిన ఆ ముఠాలోని కీలక సభ్యుడిని కస్టమ్స్ చట్టం-1962 కింద పోలీసులు అరెస్టు చేశారు.

వాణిజ్య రవాణా మార్గాల ద్వారా తప్పుడు సమాచారంతో, రహస్యంగా దిగుమతి చేసుకునే నిషేధిత సరుకులను గుర్తించడంలో డీఆర్ఐ నిరంతర కృషిని ఈ ఆపరేషన్ మరోసారి నిరూపించింది.

# న్యూఢిల్లీలో బ్రిక్స్ దేశాల పన్నుల విభాగాధిపతుల సమావేశాన్ని ప్రారంభించిన

## కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 24:పన్నుల సహకార విభాగంలో బ్రిక్స్ సారథిగా భారత్ పదవీకాలం ముగింపు సందర్భంగా... న్యూఢిల్లీలో నిర్వహించిన 'బ్రిక్స్ పన్నుల విభాగాధిపతుల సమావేశాన్ని' కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ ఈ రోజు ప్రారంభించారు. ఈ సమావేశంలో కేంద్ర ఆర్థిక మంత్రితో పాటు, కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి శ్రీ పంకజ్ చౌదరి, రెవెన్యూ కార్యదర్శి శ్రీ అరవింద్ శ్రీవాస్తవ ప్రసంగించారు.

ఈ సమావేశానికి సీబీడీటీ ఛైర్మన్ శ్రీ రవి అగర్వాల్, సీబీడీటీ సభ్యుడు (లెజిస్లేషన్) శ్రీ ప్రసేన్‌జీత్ సింగ్, సీబీడీటీకి చెందిన ఇతర సభ్యులు, రెవెన్యూ శాఖ (డీఓఆర్) సీనియర్ అధికారులు హాజరయ్యారు. భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్ నిర్వహించిన ఈ సమావేశం... బ్రిక్స్ సభ్య దేశాల పన్నుల విభాగాల అధిపతులను ఒకచోట చేర్చింది. బ్రెజిల్, చైనా, ఈజిప్ట్, ఇథియోపియా, భారత్, ఇండోనేషియా, ఇరాన్, రష్యా, దక్షిణాఫ్రికా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అనే పది బ్రిక్స్ దేశాల పన్నుల నిర్వహణ సంస్థల ప్రతినిధులు... తమ అనుభవాలను పంచుకోవడానికి, ఎదురవుతున్న సవాళ్లను సహకారం, సమన్వయం ద్వారా ఎదుర్కొనే మార్గాలను చర్చించడానికి సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా శ్రీమతి సీతారామన్ మాట్లాడుతూ... భారత్ సారథ్య కాలంలో బ్రిక్స్ పన్నుల సహకారంలో సాంకేతికత, పరిపాలన, మానవ వనరులు మూడు నిరంతర ప్రాధాన్యాంశాలుగా ఉన్నాయని ప్రముఖంగా పేర్కొన్నారు. పన్నుల నిర్వహణను మరింత కచ్చితమైనదిగా మార్చడంలో, మరింత అందుబాటులోకి తీసుకురావడంలో డేటా, డిజిటల్ మౌలిక సదుపాయాల పాత్రను ఆమెను స్పష్టం చేశారు. కేవలం ఒక దేశ అధ్యక్ష పదవీ కాలానికే పరిమితం కాకుండా, భవిష్యత్తులోనూ దేశాల మధ్య సహకారం కొనసాగేలా శాశ్వత సంస్థాగత ఏర్పాట్లు, ఆచరణాత్మక సాధనాలు అవసరమని ఆమె పేర్కొన్నారు. పన్నుల విభాగాల్లో పనిచేసే సిబ్బంది నైపుణ్యాలపై పెట్టుబడి పెట్టడం, వివిధ దేశాల అధికారుల మధ్య వృత్తిపరమైన సంబంధాలను పెంపొందించడం చాలా విలువైనదని కేంద్ర మంత్రి అన్నారు. ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ పన్నుల సహకార ఒప్పంద చర్చలతో పాటు ప్రస్తుతం జరుగుతున్న బహుపాక్షిక పన్నుల చర్చలు న్యాయబద్ధంగా, శాశ్వతంగా కొనసాగాలంటే బ్రిక్స్ దేశాల అభిప్రాయాలు, దృక్పథాలు చాలా కీలకమని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో అనేక చరిత్రాత్మక నిర్ణయాలను అధికారికంగా ఆమోదించారు. అంతర్జాతీయ పన్నులు-బదిలీ ధరలు, ఆదాయ గణాంకాల విషయంగా రెండు నూతన కార్యాచరణ బృందాలను ఏర్పాటు చేశారు. ఈ రెండింటికీ భారత్ నాయకత్వం వహించనుంది. దీనివల్ల ఏ దేశం అధ్యక్ష పదవిలో ఉన్నప్పటికీ నిరంతరం పనిచేసే ఒక శాశ్వత సంస్థాగత వేదిక ఏర్పాటుకు వీలుంటుంది. ఏప్రిల్ 2026లో నాగ్‌పూర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్ వేదికగా నిర్వహించిన తొలి "బ్రిక్స్ యువ పన్ను నిపుణుల నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం"ను ఇకమీదట ప్రతియేటా నిర్వహించే ఒక శాశ్వత విధానంగా మార్చారు. ఒకరి అనుభవాల నుంచి మరొకరు నేర్చుకునే ఉమ్మడి వేదికగా "బ్రిక్స్ ట్యాక్స్ క్రాస్-లెర్నింగ్ ల్యాబ్"నూ అధికారికంగా ప్రారంభించారు. "బ్రిక్స్ పన్నుల సహాయక నెట్‌వర్క్" కార్యాచరణ నిబంధనలనూ ఈ సమావేశంలో ఆమోదించారు.

బ్రిక్స్ పన్నుల విభాగం సారథిగా భారత్ పూర్తి రికార్డును సూచించే బ్రిక్స్ పన్నుల పురోగతి నివేదిక-2026ను లాంఛనంగా ఆమోదించడంతో సమావేశం ముగిసింది. 2027 సంవత్సరానికి బ్రిక్స్ పన్నుల సహకార విభాగానికి కాబోయే అధ్యక్ష దేశంగా పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనాకు స్వాగతం పలికారు.

ఈ సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించిన, బ్రిక్స్ పన్నుల విభాగ సారథ్య బాధ్యతలు ఫలప్రదంగా నిర్వహించిన భారత ప్రభుత్వాన్ని బ్రిక్స్ దేశాల పన్నుల విభాగాల అధిపతులు ప్రత్యేకంగా ప్రశంసించారు.

# పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం (డీఏఆర్‌పీజీ) నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రచారం-6

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24:పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం (డీఏఆర్‌పీజీ) నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రచారం-6లో పాల్గొనేందుకు హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంహెచ్ఏ) సన్నద్ధమవుతోంది. ఈ కార్యక్రమాన్ని రెండు దశల్లో నిర్వహిస్తోంది.

స్వచ్ఛతను సంస్థాగతం చేయడం, ప్రభుత్వంలో అపరిష్కృత అంశాలను తగ్గించాలనే ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికత స్ఫూర్తితో పరిశుభ్రతను ప్రోత్సహించడం, పనిని క్రమబద్ధీకరించడం, పెండింగులో ఉన్న ఫిర్యాదులను పరిష్కరించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కేంద్ర హోం, సహకార మంత్రి శ్రీ అమిత్ షా మార్గదర్శకత్వంలో ప్రజలతో నేరుగా మమేకమయ్యే క్షేత్రస్థాయి, అవుట్ స్టేషన్ కార్యాలయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

సుస్థిరమైన, పర్యావరణహిత పని ప్రదేశాలను రూపొందించేలా ప్రత్యేక క్యాంపెయిన్-6లో హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రత్యేక దృష్టి సారిస్తుంది. అదే సమయంలో పెండింగులో ఉన్న సిఫారసులను, అంశాలను పరిష్కరిస్తుంది. వీటిలో పార్లమెంటు సభ్యులు, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చిన సిఫారసులు, పార్లమెంటు హామీలు, అంతర మంత్రిత్వ శాఖ సంప్రదింపులు, ప్రజా ఫిర్యాదులు, అప్పీళ్లతో పాటు మెరుగైన రికార్డు నిర్వహణ కూడా ఉంది.

మంత్రిత్వశాఖలో అత్యున్నత స్థాయిలో ప్రత్యేక ప్రచారం-6 అమలు తీరును పర్యవేక్షిస్తున్నారు. ఈ కార్యక్రమ ప్రాధాన్యం గురించి కేంద్ర సాయుధ పోలీసు బలగాలకు (సీఏపీఎఫ్), కేంద్రీయ పోలీసు సంస్థలకు (సీపీవో) అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడానికి సమిష్టిగా కృషి చేస్తూ, మరింత చొరవ చూపాలని వారిని ప్రోత్సహించారు.

పారిశుద్ధ్యం, సమర్థమైన రికార్డు నిర్వహణ, పెండింగులో ఉన్న అంశాలను సకాలంలో పరిష్కరించడం, స్వచ్ఛమైన, పర్యావరణహితమైన, మరింత ఉత్పాదకమైన పని ప్రదేశాలను రూపొందించేందుకు చేపడుతున్న ప్రయత్నాల ద్వారా ఈ ప్రత్యేక ప్రచారం సాధించిన ఫలితాలను సంస్థాగతం చేయడానికి మంత్రిత్వ శాఖ కట్టుబడి ఉంది.

పెండింగులో ఉన్న అంశాలను తగ్గించడం, పారిశుద్ధ్యాన్ని, సమర్థమైన రికార్డు నిర్వహణను ప్రోత్సహించడం కోసం ఉద్దేశించిన ప్రత్యేక ప్రచారంలో హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ, దాని అనుబంధ/అధీన సంస్థలు చురుగ్గా పాల్గొంటున్నాయి. నవంబర్ 2025 నుంచి ఆగస్టు 2026 వరకు పెండింగులో ఉన్న అంశాలను పరిష్కరించడంలోనూ స్వచ్ఛమైన, మరింత సమర్థవంతమైన పని ప్రదేశాలను తయారుచేయడంలో మంత్రిత్వ శాఖ, క్షేత్రస్థాయి/అవుట్ స్టేషన్ కార్యాలయాలు గణనీయమైన ప్రగతిని సాధించాయి.

క్షేత్రస్థాయి, అవుట్ స్టేషన్ కార్యాలయాలతో సహా వివిధ ప్రాంతాల్లో 761 స్వచ్ఛతా క్యాంపెయిన్లను మంత్రిత్వశాఖ నిర్వహించింది.

పార్లమెంటు సభ్యుల నుంచి వచ్చిన 299 సిఫారసులు, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చిన 336 సిఫారసులు, 7 పీఎంవో సిఫారసులు పరిష్కారమయ్యాయి.

ఈ కాలంలో వచ్చిన మొత్తం 52,050 ప్రజా ఫిర్యాదులను,, 7,410 ప్రజా ఫిర్యాదుల అప్పీళ్లను మంత్రిత్వశాఖ పరిష్కరించింది. ఎంహెచ్ఏ, కేంద్ర సాయుధ పోలీసు బలగాల (సీఏపీఎఫ్)కు చెందిన కార్యాలయాల్లో 1,02,084 చదరపు అడుగుల కార్యాలయ స్థలం ఖాళీ అయింది.

ఎలాంటి అవరోధాలు లేకుండా సమాచారాన్ని సమీకరించడానికి, కచ్చితత్వాన్ని నిర్ధారించడానికి హోం వ్యవహారాల మంత్రిత్వశాఖ ఓ అంతర్గత పోర్టల్‌ను ఉపయోగిస్తోంది. దీని ద్వారా ప్రచారానికి సంబంధించిన డేటాను కేంద్రపాలిత ప్రాంతాలు, ఢిల్లీ పోలీసు విభాగాలతో సహా మంత్రిత్వశాఖలోని అన్ని విభాగాలు అప్‌లోడ్ చేస్తాయి.

ఈ పోర్టల్ ద్వారా వివిధ విభాగాలు, కార్యాలయాల మధ్య సమన్వయం మెరుగుపడింది. అలాగే కచ్చితమైన సమాచారాన్ని సకాలంలో సేకరించి, క్రోడీకరించడం సులభతరమైంది.

# వరల్డ్‌స్కిల్స్ షాంఘై 2026: అంతర్జాతీయ వేదికపై భారత్ నుంచి అతిపెద్ద నైపుణ్య బృందం.. నేటి నుంచే పోటీలు ప్రారంభం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24: వరల్డ్‌స్కిల్స్ షాంఘై 2026 పోటీలు నేడు ఘనంగా ప్రారంభమయ్యాయి. దేశ చరిత్రలోనే 70 మంది యువ పోటీదారులతో కూడిన అత్యంత పెద్ద భారత జట్టు 63 నైపుణ్య విభాగాల్లో పోటీపడేందుకు సిద్ధమైంది. నిన్న సాయంత్రం జరిగిన ప్రారంభోత్సవంలో ప్రపంచవ్యాప్తంగా వచ్చిన దేశాల బృందాలతో కలిసి భారత జట్టు 'పరేడ్ ఆఫ్ నేషన్స్'లో ఉత్సాహంగా పాల్గొంది. నాలుగు రోజుల పాటు ఈ పోటీలు కొనసాగనున్నాయి.

షాంఘై వరల్డ్ ఎక్స్‌పో కల్చరల్ సెంటర్‌లో జరిగిన ఈ ప్రారంభోత్సవంలో 65కి పైగా దేశాలు, ప్రాంతాల నుంచి దాదాపు 1,400 మంది పోటీదారులు ఒకే వేదికపైకి వచ్చారు. జాతీయ పతాకాన్ని చేతిలో పట్టుకొని టీం ఇండియా దుస్తులు ధరించిన భారత బృందం ప్రాంగణంలోకి అడుగుపెట్టగానే ప్రేక్షకుల నుంచి విశేష ప్రశంసలు లభించాయి. దీంతో 48వ వరల్డ్‌స్కిల్స్ పోటీలు అధికారికంగా ప్రారంభమయ్యాయి.

48వ వరల్డ్‌స్కిల్స్ పోటీలు షాంఘైలో అధికారికంగా ప్రారంభం కాగా.. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ శుభాకాంక్షలు తెలుపుతూ పంపిన లేఖను ప్రారంభోత్సవ వేదికపై చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో చైనా ప్రధాని లీ కియాంగ్ పాల్గొని పోటీలను అధికారికంగా ప్రారంభించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న యువ ప్రతిభావంతుల నైపుణ్యాలను ఒకే చోటికి చేర్చే అంతర్జాతీయ స్కిల్స్ పోటీలకు ఇది నాంది పలికింది.

ప్రారంభోత్సవ కార్యక్రమంలో భారత ప్రతినిధి బృందం నాయకత్వంలో వరల్డ్‌స్కిల్స్ ఇండియా అధికార ప్రతినిధి, నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ సీనియర్ ఆర్థిక సలహాదారు శ్రీమతి మనీషా సేన్శర్మ, డీజీటీ డైరెక్టర్ జనరల్, జాతీయ నైపుణ్య సంస్థ (ఎన్ఎస్ఓ) సీఈఓ శ్రీ దిలీప్ కుమార్ పాల్గొన్నారు. ప్రపంచ స్థాయి పోటీలు ప్రారంభమైన సందర్భంగా వారు పోటీదారులు, నిపుణులు, మార్గదర్శకులతో భారత జట్టుకు మద్దతు తెలిపారు.

ఎన్ఎస్ఓ డీజీటీ డైరెక్టర్ జనరల్ శ్రీ దిలీప్ కుమార్ మాట్లాడుతూ.. "మా పోటీదారులు నెలల తరబడి కఠినమైన సాంకేతిక శిక్షణ, అనేకసార్లు నిర్వహించిన సాధన పోటీలు, నిపుణులు, పరిశ్రమ భాగస్వాముల మార్గదర్శకత్వం తర్వాత షాంఘైకి చేరుకున్నారు. మొత్తం 70 మంది అభ్యర్థుల్లో 14 మంది పారిశ్రామిక శిక్షణా సంస్థల (ఐటీఐలు) నుంచి వచ్చినవారని తెలియజేస్తున్నందుకు సంతోషంగా ఉంది. ఇప్పుడు నాలుగు రోజుల పోటీల్లో కచ్చితత్వం, సంయమనం, స్థిరమైన ప్రదర్శనతో రాణించడంపై దృష్టి పెట్టాలి. భారత జట్టుకు మొత్తం ప్రతినిధి బృందం పూర్తి మద్దతుగా నిలుస్తోంది" అని అన్నారు.

వరల్డ్‌స్కిల్స్ ఇండియా అధికార ప్రతినిధి, ఎంఎస్‌డీఈ సీనియర్ ఆర్థిక సలహాదారు శ్రీమతి మనీషా సెన్ శర్మా మాట్లాడుతూ.. "ప్రారంభోత్సవ కార్యక్రమంలో భారత జట్టు కవాతను చూడటం ఎంతో గర్వంగా అనిపించింది. మా 70 మంది పోటీదారుల్లో ప్రతి ఒక్కరూ నైపుణ్యాలు కలిగిన, ఆత్మవిశ్వాసంతో ఉన్న దేశ ఆకాంక్షలకు ప్రతీకగా నిలుస్తున్నారు. ఈరోజు పోటీలు ప్రారంభమైనందున, ప్రపంచంలోని అత్యుత్తమ ప్రతిభావంతులతో తమ సామర్థ్యాలను పోల్చుకునే అవకాశం వారికి లభిస్తుంది. అంతర్జాతీయంగా ఉన్న సహచరుల నుంచి నేర్చుకోవడంతో పాటు, దేశ నైపుణ్యాభివృద్ధి వ్యవస్థ నుంచి వెలువడుతున్న ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పేందుకు వారికి అవకాశం లభిస్తుంది" అని పేర్కొన్నారు.

ఈ ఏడాది భారత జట్టు పాల్గొనడం ద్వారా పోటీల పరిమాణం, నైపుణ్యాల విభాగాల సంఖ్య గణనీయంగా పెరిగాయి. తొలిసారిగా భారత్ 11 కొత్త నైపుణ్య విభాగాల్లో పోటీ పడనుంది. అవి: డెంటల్ ప్రోస్థటిక్స్ (దంతాల కృత్రిమ పరికరాల తయారీ), డిజిటల్ ఇంటరాక్టివ్ మీడియా డిజైన్, ఇంటెలిజెంట్ భద్రతా సాంకేతికత, ల్యాండ్‌స్కేప్ గార్డెనింగ్, ఆప్టోఎలక్ట్రానిక్ సాంకేతికత, రిటైల్ సేల్స్, అన్‌మ్యాన్డ్ ఏరియల్ సిస్టమ్స్, ఇండస్ట్రియల్ మెకానిక్స్, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్, హెవీ వెహికల్ సాంకేతికత, ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్.

మార్చ్‌పాస్ట్‌లో భారత ప్రతినిధి బృందం పాల్గొనడం ద్వారా దేశంలోని నైపుణ్యాభివృద్ధి వ్యవస్థలో ఉన్న వైవిధ్యం, బలం ప్రతిబింబించాయి. రాష్ట్ర ప్రభుత్వాలు, సెక్టార్ స్కిల్ కౌన్సిళ్లు, శిక్షణా సంస్థలు, పరిశ్రమ భాగస్వాములు, నిపుణులు, మార్గదర్శకుల సహకారంతో పోటీదారులు కఠినమైన ఎంపిక ప్రక్రియను పూర్తి చేసి, నెలల తరబడి ప్రత్యేక శిక్షణ, విస్తృత సాధన, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణమైన సన్నద్ధతను పొందారు.

వరల్డ్‌స్కిల్స్ ఇంటర్నేషనల్ ప్రతి రెండేళ్లకోసారి నిర్వహించే ప్రపంచ నైపుణ్య పోటీ, వృత్తి విద్య, శిక్షణ, నైపుణ్య ప్రావీణ్యానికి ప్రపంచంలోనే అతిపెద్ద అంతర్జాతీయ వేదిక. ఈ పోటీ ద్వారా యువ నిపుణులు తమ సాంకేతిక నైపుణ్యం, ఖచ్చితత్వం, సృజనాత్మకత, పనితనం, ఆవిష్కరణ సామర్థ్యాన్ని ప్రదర్శించవచ్చు.

ప్రపంచ ప్రమాణాలతో తమ నైపుణ్యాలను పోల్చుకునే అవకాశం లభిస్తుంది.

ఈరోజు ఉదయం 9 గంటలకు షాంఘైలోని నేషనల్ ఎగ్జిబిషన్, కన్వెన్షన్ సెంటర్‌లో నైపుణ్య పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలు సెప్టెంబర్ 26 వరకు కొనసాగుతాయి. అనంతరం సెప్టెంబర్ 27న ముగింపు కార్యక్రమం నిర్వహించనున్నారు. వరల్డ్‌స్కిల్స్ షాంఘై 2026లో వరల్డ్‌స్కిల్స్ ఎక్స్‌పో, వరల్డ్‌స్కిల్స్ కాన్ఫరెన్స్ కూడా జరుగుతున్నాయి. వీటిలో యువత, విధాన రూపకర్తలు, విద్యావేత్తలు, పరిశ్రమల నాయకులు పాల్గొని నైపుణ్యాలను తెలుసుకోవడంతో పాటు సాంకేతిక, వృత్తి విద్య, శిక్షణ, భవిష్యత్ ఉద్యోగుల అభివృద్ధిపై ఆలోచనలు పంచుకుంటారు.

పోటీలు ప్రారంభమైన నేపథ్యంలో, వరల్డ్‌స్కిల్స్ లియోన్ 2024లో భారత్ సాధించిన విజయాలను మరింత ముందుకు తీసుకెళ్లాలని భారత జట్టు లక్ష్యంగా పెట్టుకుంది. ఆ పోటీల్లో భారత్ నాలుగు కాంస్య పతకాలు, 12 మెడలియన్స్ ఫర్ ఎక్సలెన్స్ (అత్యుత్తమ ప్రతిభకు గుర్తింపు పతకాలు) సాధించింది. షాంఘై పోటీలు భారత యువ నిపుణులకు ప్రపంచంలోని అత్యుత్తమ ప్రతిభావంతులతో తమ నైపుణ్యాలను పరీక్షించుకునే అవకాశం కల్పిస్తున్నాయి. దేశంలోని నైపుణ్యం కలిగిన యువత ప్రతిభ, క్రమశిక్షణ, భవిష్యత్తు అవసరాలకు సిద్ధంగా ఉండే సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పే వేదికగా నిలుస్తున్నాయి.

# దక్షిణ మధ్య రైల్వేలో మొదటిసారి కవచ్ 4.0 వ్యవస్థను ప్రారంభించిన భారతీయ రైల్వే..

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24:రైలు భద్రతలో ఓ కీలక అధ్యాయానికి భారతీయ రైల్వే నాంది పలికింది. కవచ్ వెర్షన్లో 4.0 స్థాయిని దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్)లో మొదటిసారి విజయవంతంగా అమల్లోకి తీసుకువచ్చింది. హైదరాబాద్ డివిజన్.. మల్కాజ్‌గిరి-కామారెడ్డి సెక్షన్లో 108 కిలోమీటర్ల కన్న ఎక్కువ మార్గంలో కవచ్ 3.2 వెర్షన్ అమల్లో ఉండగా, దాని స్థానంలో కవచ్ 4.0 వెర్షన్‌ను అమర్చే పనిని విజయవంతంగా పూర్తి చేశారు.

దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్)లో 1,465 కి.మీ. మార్గంలో కవచ్ 3.2 వెర్షన్‌ను జయప్రదంగా నిర్వహించి సంపాదించిన అనుభవాన్ని ఆధారంగా చేసుకొని, నూతన వెర్షన్లో మరింత మెరుగైన సాంకేతికతను జతపరిచారు. కవచ్ 4.0 అధిక భద్రతనూ, ఉన్నత సాంకేతికతనూ, అధిక విశ్వసనీయతనూ, రైళ్ల రాకపోకల నిర్వహణలో సురక్షనూ సమకూరుస్తుంది. దీనిని భారతీయ రైల్వేలో విస్తృత స్థాయిలో అమలు చేయాలని సంకల్పించారు.

భారతదేశంలో వివిధ రైల్వే నెట్‌వర్కులకు కవచ్ 4.0 తో ఉన్నత స్థాయి భద్రత సౌకర్యాలు అందుబాటులోకి

కవచ్ వెర్షన్ 4.0ను పలు విధాలుగా అభివృద్ధిపరిచి, పరీక్షించారు. ఇక దీనిని భారతీయ రైల్వే ఆధ్వర్యంలో ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ (ఏటీపీ) వ్యవస్థగా ఉపయోగంలోకి తీసుకువస్తున్నారు. భారతీయ రైల్వే నెట్‌వర్కుకు చెందిన వివిధ కార్యకలాపాలకు సంబంధించి నిర్వహణ పరమైన, సాంకేతిక పరమైన అవసరాల్ని తీర్చడానికి అవసరపడే ముఖ్యమైన మెరుగుదల చర్యలను తాజా వెర్షన్‌లో ఇమిడ్చారు.

ప్రాంతాన్ని గుర్తించడంలో కచ్చితత్వాన్ని పెంచారు.. దీంతో రైళ్లు ఎక్కడున్నదీ మరింత పక్కాగా నిర్ధారించడం సాధ్యపడుతుంది.

పెద్ద యార్డుల్లో సిగ్నల్ సంబంధిత అంశాలను మెరుగ్గా తెలుసుకొనే సౌకర్యం.. దీని వల్ల రైలు రాక పోకల కాలంలో ఏ సమయంలో ఎక్కడ ఉందన్న అవగాహన పెరుగుతుంది.

ఇది వరకటితో పోలిస్తే అభివృద్ధి పరిచిన కమ్యూనికేషన్, సిస్టమ్ ఏకీకరణ కోసం ఆప్టికల్ ఫైబర్ కేబుల్ (ఓఎఫ్‌సీ) మాధ్యమం ద్వారా స్టేషన్‌కూ స్టేషన్‌కూ మధ్య కవచ్ ఇంటర్‌ఫేస్‌ను కల్పించారు.

ఇప్పటి ఎలక్ట్రానిక్ సిగ్నలింగ్ సిస్టమ్‌తో నేరుగా ఇంటర్‌ఫేస్ సదుపాయాన్ని కల్పించారు. దీనివల్ల ప్రస్తుత సిగ్నలింగ్ సంబంధిత మౌలిక సదుపాయాలతో మెరుగైన ఏకీకరణ సాధ్యపడింది.

ఈ మెరుగుదల పనులతో కవచ్ 4.0 దేశంలో స్వదేశీ ఆటోమేటిక్ ట్రయిన్ ప్రొటెక్షన్ టెక్నాలజీలో ఓ ప్రధాన పురోగతి చోటు చేసుకుంది. దీనితో భారతీయ రైల్వేలో విస్తృత స్థాయిలో ఉపయోగించడానికి ప్రబల సాంకేతిక పునాది పడింది.

దేశీయంగా అభివృద్ధిపరిచిన ఆటోమేటిక్ ట్రయిన్ ప్రొటెక్షన్ సిస్టమే కవచ్. దీనిని రైళ్ల రాకపోకల్లో భద్రతను పెంచే లక్ష్యంతో రూపొందించారు. లోకో రైళ్లను నిర్ధారిత వేగ పరిమితిని మించకుండా ఉంచడంలో ఈ వ్యవస్థ పైలట్లకు సాయపడుతుంది. ఈ పనిని చేయడంలో లోకో పైలట్ విఫలమైన పక్షంలో, అవసరం అయినప్పుడు ఈ వ్యవస్థ తనంతట తనే బ్రేకులను వేయగలుగుతుంది.

అపాయకర స్థితిలో సిగ్నల్‌ను దాటి వెళ్లే (సిగ్నల్ పాసింగ్ ఎట్ డేంజర్.. ఎస్‌పీఏడీ) ఘటన నుంచి కాపాడటానికీ, క్లిష్ట పరిస్థితుల్లో రైలు వేగాన్ని అదుపు చేయడానికీ, ప్రమాదాలకు లోనయ్యే ముప్పును తగ్గించడానికీ కవచ్‌ను రూపొందించారు. ఈ వ్యవస్థ అననుకూల వాతావరణ స్థితిలో కూడా రైలును సురక్షితంగా నడపడంలో సాయపడుతుంది.

అత్యధిక సాంకేతిక ఆధారిత భద్రత వ్యవస్థగా తీర్చిదిద్దిన కవచ్.. అత్యున్నత స్థాయి సురక్ష ధ్రువీకరణపత్రం 'సేఫ్టీ ఇంటెగ్రిటీ లెవెల్-4' (ఎస్ఐఎల్-4)ను అందుకోవలసి ఉంటుంది.కవచ్‌ను రంగంలోకి దింపడానికి విస్తృత స్థాయిలో మౌలిక సదుపాయాలు అవసరం

కవచ్ వ్యవస్థను అమల్లోకి తీసుకురావడానికి రైల్వే సెక్షన్లలో అనేక సాంకేతిక విజ్ఞాన సంబంధిత కాంపొనెంట్లతో పాటు కమ్యూనికేషన్ కాంపొనెంట్లను వినియోగించవలసి వస్తుంది. వాటిలో ఈ కింద ప్రస్తావించినవి భాగంగా ఉంటాయి:

దక్షిణ మధ్య రైల్వేలో కవచ్ 4.0ను విజయవంతంగా ప్రారంభించడంతో, స్వదేశీ రైల్వే భద్రతాపరమైన సాంకేతికతను పటిష్ఠపరచడంతో పాటు భారతీయ రైల్వే నెట్‌వర్క్‌లో ఆధునిక ఆటోమేటిక్ ట్రయిన్ ప్రొటెక్షన్ సామర్థ్యాలను విస్తరించే దిశగా ఒక కీలకమైన అడుగును వేసినట్లయింది.

# భారీ వర్షాల ప్రభావంపై ప్రత్యేక చర్యలు



ఖమ్మం, సెప్టెంబర్ 24: వైరా మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డులో?ల గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంపై పురపాలక యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. వర్షాల వల్ల వార్డుల్లో తలెత్తిన డ్రైనేజీ సమస్యలు, మురుగునీటి ప్రవాహ పరిస్థితిని గురువారం మున్సిపల్ కమిషనర్ రామచంద్రరావు, వైస్ చైర్మన్ కట్ల సంతోష్ క్షేత్రస్థాయిలో పరిశీలించి సమీక్షించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వార్డుల్లో మురుగునీరు నిలిచిపోకుండా తక్షణ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. స్థానికంగా ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే ఆయా వార్డుల కౌన్సిలర్లకు సమాచారం అందించాలని సూచించారు. మున్సిపల్ సిబ్బంది అంతా ప్రజలకు అందుబాటులో ఉంటారని చెప్పారు. ఒకవైపు వినాయక నిమజ్జన కార్యక్రమాలు, మరొకవైపు వర్షాల నేపథ్యంలో పారిశుద్ధ్య పనుల్లో ఎలాంటి లోపాలు తలెత్తకుండామున్సిపాలిటీ కార్మికులు అనునిత్యం అందుబాటులో ఉండి విధులు నిర్వర్తిస్తున్నారని కమిషనర్, వైస్ చైర్మన్ వివరించారు. ప్రజలు కూడా పారిశుద్ధ్య నిర్వహణకు సహకరించాలని కోరారు.

# నిజామాబాద్‌లో మహిళల రోడ్ సైక్లింగ్ పోటీలు..



నిజామాబాద్, సెప్టెంబర్ 24: మహిళల్లో సైక్లింగ్‌పై ఆసక్తిని పెంపొందించడంతో పాటు ప్రతిభావంతులైన క్రీడాకారిణులకు పోటీ వేదిక కల్పించేందుకు నిజామాబాద్‌లో అస్మిత ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్?రోడ్ సైక్లింగ్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ నెల 27, 28 తేదీల్లో జిల్లా కేంద్రంలో పోటీలు జరగనున్నట్లు జిల్లా సైకిల్ సంఘం అధ్యక్షుడు జీవీ కృపాకర్‌రెడ్డి, కార్యదర్శి బి. విజయ్‌కాంత్‌రావు తెలిపారు.

సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (సీఎఫ్ఐ), ఖేలో ఇండియా (సాయ్) సహకారంతో తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్ ఆదేశాల మేరకు జిల్లా సైకిల్ సంఘం ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళా సైక్లిస్టుల ప్రతిభను వెలికితీయడంతో పాటు చురుకైన, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడం పోటీల ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

పోటీల్లో విమెన్ ఎలైట్, జూనియర్ బాలికల విభాగాల్లో అర్హత కలిగిన సైక్లిస్టులు పాల్గొనవచ్చని నిర్వాహకులు తెలిపారు. విమెన్ ఎలైట్ విభాగంలో 19 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల మహిళలు, జూనియర్ బాలికల విభాగంలో 15 నుంచి 18 సంవత్సరాల మధ్య వయస్సు గల వారు అర్హులని వివరించారు. పాల్గొనే క్రీడాకారిణులు వయస్సు, అర్హతకు సంబంధించిన చెల్లుబాటు అయ్యే ధ్రువపత్రాలను సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు.

పోటీల్లో పాల్గొనే సైక్లిస్టులు తమ సైకిళ్లు, వ్యక్తిగత సైక్లింగ్ పరికరాలను స్వయంగా సమకూర్చుకోవాలని సూచించారు. పోటీ నిబంధనలకు అనుగుణంగా సైకిళ్లు, పరికరాలు ఉండాలని పేర్కొన్నారు. ప్రతి క్రీడాకారిణికి ఖేలో ఇండియా ఐడీ (కేఐడీ) తప్పనిసరి అని తెలిపారు. కేఐడీ లేని వారు ముందుగా ఎన్ఎన్ఆర్ఎన్ పోర్టల్‌లో నమోదు చేసుకుని కేఐడీ పొందిన అనంతరం ఈవెంట్‌కు నమోదు చేసుకోవాలని సూచించారు.

వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు బంగారు, వెండి, కాంస్య పతకాలతో పాటు మెరిట్ సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సమావేశంలో జిల్లా సైకిల్ సంఘం ఉపాధ్యక్షులు రాజ్‌కుమార్, సుబేదార్ సూర్యప్రకాష్, కోశాధికారి సురేందర్ తదితరులు పాల్గొన్నారు. పోటీలకు సంబంధించిన ఇతర వివరాల కోసం తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ బి. విజయ్‌కాంత్‌రావును 9912883331 నంబర్‌లో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

# మోతెలో భారీ వర్షానికి ఇంటి గోడ కూలి. పెను ప్రమాదం తప్పింది

నల్గొండ, సెప్టెంబర్ 24: మోతె మండల కేంద్రంలో గురువారం కురిసిన భారీ వర్షానికి ఒక నిరుపేద కుటుంబం నిరాశ్రయురాలిగా మిగిలింది. మోతె గ్రామానికి చెందిన లింగాల లక్ష్మి, భర్త యాదగిరికి చెందిన పాత సిమెంట్ గోడల ఇల్లు వర్షానికి నాని ఒక్కసారిగా కూలిపోయింది.రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో ఇంటి గోడలు తడిసి బలహీనపడ్డాయి. ఉదయం సమయంలో పెద్ద శబ్దంతో ఇంటి గోడ కూలిపోయింది. గోడ కూలిన శబ్దం విని చుట్టుపక్కల వారు వచ్చి చూశారు.

ఆ సమయంలో ఇంటిలో ఎవరూ లేకపోవడంతో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. అదృష్టవశాత్తు పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.ఇంటి గోడ కూలిపోవడంతో ఇంట్లో ఉన్న వంట సామాన్లు, బట్టలు, ఇతర వస్తువులు శిథిలాల కింద చిక్కుకుపోయి కొన్ని పూర్తిగా ధ్వంసమయ్యాయి. లింగాల లక్ష్మి కుటుంబం రోజువారీ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఇల్లు పూర్తిగా దెబ్బతినడంతో నిలువ నీడ లేకుండా పోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.


ప్రస్తుతం అద్దె ఇంట్లో ఉంటున్నారు.బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. నిరుపేదలైన తమకు ఇల్లు నిర్మించుకునే స్తోమత లేదని, ప్రభుత్వం తక్షణమే స్పందించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని లింగాల లక్ష్మి వేడుకుంటున్నారు. రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి తగిన సహాయం అందించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# రోడ్డు ప్రమాదంలో తిరుమలాయపాలెం ఎస్సైకు గాయాలు

తిరుమలాయపాలెం, సెప్టెంబర్ 24: ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తిరుమలాయపాలెం ఎస్సై కూచిపూడి జగదీష్‌కు గాయాలయ్యాయి. ఆయన ప్రయాణిస్తున్న పోలీస్ వాహనాన్ని లారీ ఢీకొనడంతో ఎస్సైతో పాటు డ్రైవర్ కొత్తపల్లి రాకేష్‌కు కూడా తీవ్ర గాయాలయ్యాయి.

వినాయక నిమజ్జనం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో విధులు నిర్వహించిన అనంతరం పిండిప్రోలు గ్రామం నుంచి తిరుమలాయపాలెం పోలీస్ స్టేషన్‌కు తిరిగి వస్తుండగా గురువారం అర్ధరాత్రి సుమారు ఒంటి గంట సమయంలో భవాని హోటల్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ఎస్సై జగదీష్, డ్రైవర్ రాకేష్ ప్రయాణిస్తున్న పోలీస్ వాహనాన్ని లారీ ఢీకొట్టింది.

ఈ ప్రమాదంలో గాయపడిన ఎస్సై జగదీష్, డ్రైవర్ రాకేష్‌ను చికిత్స నిమిత్తం తొలుత తిరుమలాయపాలెం ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.

# తెలుగు నవలా సాహిత్య వైతాళికుడు ఉన్నవ

గాంధేయ వాదిగా, న్యాయవాదిగా, సంఘ సంస్కర్తగా, స్వాతంత్ర్య యోధుడుగా, ఉద్యమ నాయకునిగా, స్త్రీ విద్య ప్రోత్సాహికునిగా, కాంగ్రెస్ నేతగా, దళిత జనోద్ధారకునిగా, ప్రధానంగా తెలుగు నవలా సాహిత్య వైతాళికుడుగా ఉన్నవ లక్ష్మీ నారాయణ తెలుగు వారికి సుపరిచితుడే. ముఖ్యంగా నాటి సాంఘిక దురాచారాలను ప్రతిబింబించే, మాలపల్లి నవల నాడు ఒక సంచలనమే.

సాంఘిక, ఆర్థిక అసమానతలను తొలగించి, కులవ్యవస్థను నిరసించి, అందరూ సమానులే అన్న భావనతో, అగ్రవర్ణాలు, హరిజనులు అందరూ కలసి మెలసి ఉండాలని కోరుకుంటూ, మాలపల్లి అనే విప్లవాత్మకమైన నవలను రచించడం, తన దృక్పథానికి మద్దతుగా, సహ పంక్తి భోజనాలు నిర్వహించడం ఆ రోజులలో సాహసమే. మాలపల్లి తెలుగు సాహితీ చరిత్రలోనూ, సామాజిక దృక్పథంలోనూ ఒక నూతన ఒరవడిని సృష్టికి, చర్చోప చర్చలకు కారణభూతమైంది.

ఉన్నవ లక్ష్మీనారాయణ గుంటూరు జిల్లా అప్పటి సత్తెనపల్లి తాలూకా వేములూరుపాడు గ్రామంలో 1877 డిసెంబరు 4వ తేదీన శ్రీరాములు, శేషమ్మ దంపతులకు జన్మించి, ప్రాథమిక విద్య స్వగ్రామంలోనే సాగించాడు. 1897లో గుంటూరులో మెట్రిక్యులేషన్ చదివాడు. 1906లో రాజమండ్రి ఉపాధ్యాయ శిక్షణా కళాశాలలో శిక్షణ పొందాడు. 1916లో బర్లాండ్, డబ్లిన్ లలో బారిష్టర్ చదువు సాధించాడు.

గాంధేయ వాదిగా, సంఘ సంస్కర్తగా, స్వాతంత్ర్య యోధుడుగా, తెలుగు నవలా సాహిత్య వైతాళికుడుగా విశేషమైన కీర్తి పొంది, సాహిత్యం ద్వారా హరిజనోద్ధరణకు కృషి చేశాడు. గుంటూరులో శ్రీ శారదా నికేతన్ ను స్థాపించి, స్త్రీ విద్యను ప్రోత్సహించాడు. కందుకూరి వీరేశలింగం పంతులు అధ్యక్షతలో తొలి వితంతు వివాహం జరిపించిన సంస్కర్తగా నిలిచాడు.

1900 లో గుంటూరులో "యంగ్‌మెన్స్ లిటరరీ అసోసియేషన్"ను స్థాపించాడు. 1902లో అక్కడే వితంతు శరణాలయాన్ని స్థాపించాడు. వీరేశలింగం స్థాపించిన వితంతు శరణాలయాన్ని 1906 లోను, పూనాలోని కార్వే మహిళా విద్యాలయాన్ని, 1912 లోను సందర్శించి అనుభవాలను లక్ష్యానికి జోడించారు. 1913 లో జొన్నవిత్తుల గురునాథంతో కలసి విశాలాంధ్ర పటం తయారు చేశాడు.

లక్ష్మీనారాయణ 1900లో గుంటూరులో ఉపాధ్యాయ వృత్తి, 1903లో అక్కడే న్యాయవాద వృత్తిని, 1908లో ర్యాలీ కంపెనీలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించాడు. రష్యాలో 1917లో జరిగిన బోల్షవిక్ విప్లవం వల్ల స్ఫూర్తి పొందిన మొదటి తెలుగు కవి ఉన్నవ. కూలీల పక్షం వహించి కవులు రచనలు చేయడానికి ప్రేరణ నిచ్చింది సదరు రష్యా విప్లవ ప్రభావమే. 1917 లో మద్రాసు హైకోర్టులో న్యాయవాదిగా పనిచేశాడు. 1922లో గుంటూరులో శారదానికేతన్‌ను స్థాపించి బాలికలకు విద్య నేర్చుకునే అవకాశం కల్పించాడు. 1922 లో మాలపల్లి నవలను బెల్లంకొండ రాఘవరావు ముద్రించగా, మద్రాసు ప్రభుత్వం మాలపల్లి నవలపై నిషేధం విధించింది. రాజకీయ వాతావరణాన్ని,

## సెప్టెంబర్ 25...
## ఉన్నవ లక్ష్మీనారాయణ వర్ధంతి



గాంధీ మహాత్ముని ఆశయాల్ని, తెలుగువారి జీవన విధానాన్ని ప్రతిబింబించిన నవల మాలపల్లి. ఆ నవలలో సాంఘిక దురాచారాలు, జాతీయ సత్యాగ్రహ ఉద్యమాలు, వర్ణ , వర్గ వ్యత్యాసాలు తదితర ఆ నాటి పరిస్థితులను కల గలిపి, కళ్ళకు కట్టినట్లు ఉన్నవ చిత్రించడం విశేషం. ఆనాడు హరిజనుల కుటుంబ గాథను ఇతివృత్తంగా ఎన్నుకొని నవల వ్రాయడమే సాహసం. 1926 లో మద్రాసు శాసన మండలిలో మాలపల్లి నిషేధంపై చర్చలు జరగడం, 1928 లో కొన్ని మార్పులతో మాలపల్లి ప్రచురణకు తిరిగి అనుమతి లభించడం, మద్రాసు ప్రభుత్వం ఆంధ్ర విశ్వ విద్యాలయం మాలపల్లిని ప్రచురించి, ఆ నవలను పాఠ్య గ్రంథంగా ఎంపిక చేయడం, 1936 లో మద్రాసు ప్రభుత్వం మాలపల్లి నవలపై రెండోసారి నిషేధం తెలిపి ఆ నవలను పాఠ్యగ్రంథంగా తొలగించడం, 1937లో చక్రవర్తుల రాజగోపాలా చారి మద్రాసు ప్రధానిగా ఎన్నికైనప్పుడు తొలి కాంగ్రెసు మంత్రి వర్గంచే మాలపల్లి నవలపై నిషేధపు ఉత్తర్వులను రద్దు చేయించడం క్రమానుగతంగా జరిగి పోయాయి. సామాన్య ప్రజల సంక్షేమం, అభ్యుదయాన్ని కోరే కవిత్వం ప్రజలకు సులభంగా అర్థమయ్యే వాడుక భాషలో ఉండాలన్న లక్ష్యంతో మాలపల్లి నవలలో చరమగీతం, సమతాధర్మం అనే రెండు గేయ కవితల్ని సామాన్య ప్రజలకు అర్థమయ్యే నిత్య వాడుక భాషలో జానపద గేయ రీతుల్లో రచించాడు. ఆ నవలకు కాశీనాథుని నాగేశ్వరరావు పీఠిక వ్రాస్తూ, "ఆంధ్ర సాహిత్య హృదయ పరిణామాన్ని గ్రహించడానికి మాలపల్లి ఉత్తమ కావ్యం అని, తెనుగు మాటలు, తెనుగు దేశము, తెనుగు హృదయము, తెనుగు సంకల్పము, మాలపల్లి నవలకు అనిర్వచనీయ ప్రతిభను సమకూర్చాయి" అని కొనియాడాడు. అందుకే తెలుగు సాహిత్యంలో వచ్చిన తొలి విప్లవ నవలగా గుర్తింపు పొందింది. మాలపల్లి, నాయకురాలు, బుడబుక్కల జోస్యం, స్వరాజ్య సోది, భావ తరంగాలు తదితర రచనలు చేశాడు.

ఇక 1923 లో కాంగ్రెసు స్వరాజ్య పార్టీలో చేరాడు. ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు కమిటీ కార్యదర్శిగా ఎన్నికై, పల్నాడు సత్యాగ్రహ ఉద్యమానికి నాయకత్వం వహించాడు. 1931లో ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో చేరినందుకు, 1942 లో క్విట్ ఇండియా ఉద్యమంలో చేరినందుకు జైలు శిక్ష అనుభవించాడు.

గాంధేయ వాదిగా, సంఘ సంస్కర్తగా, స్వాతంత్ర్య యోధునిగా తెలుగు నవలా సాహిత్య వైతాళికుడుగా కీర్తి పొందిన ఉన్నవ 1958 సెప్టెంబరు 25 న మరణించాడు.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# పౌష్టికాహారంతోనే చిన్నారుల సంపూర్ణ ఎదుగుదల..

## వార్డ్ కౌన్సిలర్ కొండ్లెపు ముత్యం..



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 16:(నేటినిజం ప్రతినిధి): పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదల మెరుగుపడుతుందని 17వ వార్డు కౌన్సిలర్ కొండ్లెపు ముత్యం,ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ అన్నారు. గురువారం వేములవాడ పట్టణంలోని శాస్త్రినగర్ అంగన్‌వాడి కేంద్రంలో నిర్వహించిన పోషణ కార్యక్రమంలో ఆమె పాల్గొని గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కొండ్లెపు ముత్యం, మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు ఆహార విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సమతుల్యమైన పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా తల్లితో పాటు శిశువు ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం సక్రమంగా అందేలా పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం గర్భిణీ గిన్నె సితారకు అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా శ్రీమంతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ, అంగన్‌వాడీ టీచర్ మిరియాల శోభ, ఆశా వర్కర్ విజయ, మున్సిపల్ వార్డు ఆఫీసర్, అంగన్‌వాడీ సిబ్బంది, బాలింతలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# సాగు నీరు అందించి పంటలను కాపాడాలి

## బి.ఆర్.ఎస్ సీనియర్ నేత మాజీ మంత్రి నాగం జనార్దన్ రెడ్డి



మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 24: కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలోని మోటార్లను నడిపి రైతులకు సాగునీరు అందించాలని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యుత్ సమస్యల కారణంగా ప్రాజెక్టు మోటార్లు పూర్తిస్థాయిలో నడవక పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని ఆరోపించారు. నాగర్‌కర్నూల్‌లోని తన నివాసంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ప్రాజెక్టుల నిర్వహణలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న చీఫ్ ఇంజినీర్, సూపరింటెండెంట్ ఇంజినీర్ విష్ణువర్ధన్‌రెడ్డి విధులకు హాజరుకావడం లేదని నాగం ఆరోపించారు. ఆయనను వెంటనే తొలగించి, ప్రాజెక్టు పనులను పర్యవేక్షించే సమర్థ అధికారిని నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా వ్యవహరించడం లేదని విమర్శించారు.

మూడు మోటార్లు కూడా నడపడం లేదురెండు మోటార్లను నడిపినా నార్లాపూర్ రిజర్వాయర్‌లో నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉందని నాగం పేర్కొన్నారు. మోటార్లను నడిపితే రిజర్వాయర్లను నింపుకునే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదన్నారు. విద్యుత్ సమస్యల కారణంగా కనీసం మూడు మోటార్లు కూడా నడపలేని పరిస్థితి ఉందని తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జిల్లాలో పర్యటిస్తున్నప్పటికీ సున్నపుతాండలో నెలకొన్న సమస్యను పరిశీలించలేదని నాగం విమర్శించారు. సున్నపుతాండ వద్ద సుమారు 3.5 కిలోమీటర్ల మేర కాల్వ పనులు పూర్తి చేస్తే నీటిని తరలించే అవకాశం ఉన్నప్పటికీ 30 నెలలు గడిచినా పనులు పూర్తి కాలేదన్నారు. పాలమూరు?రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా రిజర్వాయర్లను నింపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

కేఎల్ఐ, పాలమూరు?రంగారెడ్డి ప్రాజెక్టు పనుల్లో కాల్వల సామర్థ్యాన్ని తగ్గించడం, నార్లాపూర్?నెల్లూరు రిజర్వాయర్ల మధ్య వ్యత్యాసం కారణంగా మోటార్లు కాలిపోయాయని నాగం ఆరోపించారు. గతంలో మంత్రిగా ఉన్న జూపల్లి కృష్ణారావు, ప్రస్తుతం మంత్రిగా ఉన్న జూపల్లి కృష్ణారావుపైనే ఇందుకు బాధ్యత ఉందని విమర్శించారు. కాంట్రాక్టర్లకు ప్రయోజనం చేకూర్చేందుకే 9 మీటర్ల టన్నెల్‌ను 7 మీటర్లకు తగ్గించారని ఆరోపించారు.

ముఖ్యమంత్రి, మంత్రులు పలుమార్లు జిల్లాకు వచ్చినప్పటికీ సాగునీటి సమస్యలపై శాశ్వత పరిష్కారం చూపలేదని నాగం అన్నారు. ఇప్పటికైనా సున్నపుతాండ వద్ద 3.5 కిలోమీటర్ల కాల్వ పనులు పూర్తి చేసి పాలమూరు?రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా రిజర్వాయర్లను నింపాలని, నార్లాపూర్‌లో 6.5 టీఎంసీల నీటిని నిల్వ చేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం వెంటనే సాగునీటి సమస్యపై స్పందించి రైతులకు నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అర్థం రవి బాలగౌడ్, ఐతోల్ లక్ష్మయ్య, కౌన్సిలర్ అర్జునయ్య, మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, శ్రీపురం సత్యం, మల్కాపురం వెంకట్‌రెడ్డి, మేస్త్రీ సత్యం, భీముడు తదితరులు పాల్గొన్నారు. ఇటీవల నాగర్‌కర్నూల్‌లో సాగునీటి కోసం విద్యుత్ సరఫరా సమస్యలపై రైతుల ఆందోళనలు కూడా నమోదయ్యాయి.

# గులాం అహ్మద్ హుస్సేన్ సేవలు అభినందనీయం

## రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు, కలెక్టర్, సిపి ప్రశంసలు



కరీంనగర్, సెప్టెంబర్ 24: (నేటినిజం ప్రతినిధి) మానవత్వమే అభిమతంగా, దేశంలో ఎక్కడా లేని విధంగా..మతసామరస్యానికి ప్రతీకగా, గంగా జమున తెహజీబ్ కు కేరాఫ్ కరీంనగర్ నగర వేదికగా, హిందూ-ముస్లిం భాయి భాయి అనే నినాదంతో జమ్.. జమ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 2005 నుండి ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు.. సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ తన స్వంత ఖర్చుతో హిందూ ముస్లిం సోదర భావాన్ని పెంపొందించేందుకు, మానవత్వపు పునాదిగా అద్భుతమైన సేవలు అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడని, రాష్ట్ర రవాణా బిసిసంక్షేమశాఖ మంత్రిపొన్నంప్రభాకర్ అన్నారు. మంత్రిపొన్నంప్రభాకర్, ఎమ్మెల్యేలు మేడిపల్లిసత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, గంగులకమలాకర్, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, జిల్లా పోలీసు కమిషనర్ గౌష్ ఆలంతో కలిసి గణేష్ నిమజ్జనం సందర్భంగా, నగరంలోని రాజీవ్ చౌక్ లో బాదం మిల్క్, మినిరల్ వాటర్, లస్సీ, రూ అబ్జా, గులాబ్ వాటర్ స్టాల్ ను సందర్శించారు.

ఈకార్యక్రమంలో ఆర్డీవో షర్మిల, ఏసీపీలు, సిఐలు, హిందూ ఉత్సవ సమితి చైర్మన్ కుందారపు మహేశ్వర్, నాయకులు పూట్కూరి రాధాకృష్ణ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈస్టాల్స్ సందర్శనకు వచ్చిన మంత్రికి, ఎమ్మెల్యేలకు, కలెక్టర్కు, సీపీకి.. గులాం అహ్మద్ కృతజ్ఞతలు తెలిపారు.

# అకినేపల్లి మల్లారంలో వైభవంగా గణనాథుని నిమజ్జనం

ములుగు, సెప్టెంబర్ 24:(నేటినిజం ప్రతినిధి): ములుగు జిల్లా మంగపేట మండలం అకినేపల్లి మల్లారం గ్రామంలో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన మండపంలో పది రోజులుగా భక్తిశ్రద్ధలతో పూజలు అందుకున్న గణనాథుడిని పవిత్ర గోదావరిలో నిమజ్జనం చేశారు. గ్రామంలో ఓ వ్యక్తి మృతి చెందడంతో బుధవారం జరగాల్సిన నిమజ్జన కార్యక్రమాన్ని గురువారానికి వాయిదా వేశారు.

మండప వ్యవస్థాపకులు, అకినేపల్లి మల్లారం మాజీ సర్పంచ్ వత్సవాయి శ్రీధరవర్మ, ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. డప్పు చప్పుళ్ల మధ్య యువతీ, యువకులు, చిన్నారులు, మహిళలు చేసిన నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు.

కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు వత్సవాయి వశిష్ట ఆజాద్, చిట్టూరి రవిచంద్, అప్పినబోయిన మనోజ్, దూలగొండ పవన్ కళ్యాణ్, చెట్టుపల్లి వంశీ, చెట్టుపల్లి నీరజ్, చెట్టుపల్లి నవదీప్, రూప వెంకట్, కాంతి సాయి కుమార్, చెట్టుపల్లి భరత్, సెగ్గం నవీన్, ఎస్.కె. రఫీ, అప్పినబోయిన బన్ను తదితరులు పాల్గొన్నారు. అకినేపల్లి మల్లారం, అకినేపల్లి మల్లారం ఎస్టీ కాలనీ, టి.కొత్తగూడెం తదితర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# ఒపెక్-భారత్ ఇంధన చర్చల 7వ ఉన్నతస్థాయి సమావేశం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24:కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుశాఖ మంత్రి శ్రీ హర్దీప్ సింగ్ పూరీ, ఒపెక్ (పెట్రోలియం ఎగుమతి దేశాల సంస్థ-ఓపీఈసీ) ప్రధాన కార్యదర్శి శ్రీ హైథమ్ అల్ ఘైస్ సహ అధ్యక్షతన ఒపెక్-భారత్ ఇంధన చర్చల 7వ ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో చమురు మార్కెట్ స్థిరత్వం, ఇంధన భద్రత, చమురు పరిశ్రమ వ్యాప్తంగా సకాలంలో పెట్టుబడులు పెట్టడం వంటి అంశాలపై చర్చించారు. ప్రపంచ ఆర్థిక విస్తరణ, ఇంధన డిమాండు వృద్ధిలో భారత్ పోషిస్తున్న కీలక పాత్రను ప్రస్తావిస్తూ.. స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక భవిష్యత్తు అంచనాలను ఇరుపక్షాలు సమీక్షించాయి.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శ్రీ హర్దీప్ సింగ్ పూరీ మాట్లాడుతూ.. భారత్, ఒపెక్ మధ్య పరస్పర సహకారం, ప్రయోజనకరమైన సంబంధాలు ఉన్నాయన్నారు. ఈ భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ఒపెక్ ప్రధాన కార్యదర్శి అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ఒపెక్, దాని సభ్య దేశాలతో భారత్‌కు ఉన్న దీర్ఘకాలిక సంబంధాలకు ఎంతో ప్రాధాన్యత ఉందని, ఇవి కీలక ఇంధన అంశాలపై పరస్పర అవగాహన, సహకారాన్ని గణనీయంగా పెంచాయని ఆయన పేర్కొన్నారు.

"ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటి. రాబోయే దశాబ్దాల్లో ప్రపంచ ఇంధన డిమాండు పెరుగుదలకు భారత్ కీలకంగా నిలుస్తుంది" అని శ్రీ హర్దీప్ సింగ్ పూరీ పేర్కొన్నారు. పెట్టుబడులను ప్రోత్సహించడం, ఇంధన రంగ సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యాన్ని బలోపేతం చేయడం, ప్రపంచ ఆర్థిక వృద్ధి, అభివృద్ధికి విశ్వసనీయమైన ఇంధన సరఫరాలను నిర్ధారించడం కోసం ఉత్పత్తిదారులు, వినియోగదారుల మధ్య నిరంతర చర్చలు అవసరమని ఆయన అన్నారు.

భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, మార్కెట్‌లో ఒడిదుడుకులు నెలకొన్న సమయంలో ప్రపంచ ఇంధన మార్కెట్లలో స్థిరత్వం, పారదర్శకతను ప్రోత్సహించేందుకు ఒపెక్ చేస్తున్న కృషిని శ్రీ పూరీ ప్రశంసించారు. సమతుల్యమైన, స్థిరమైన, ఊహించదగిన ప్రపంచ ఇంధన మార్కెట్‌ను అభివృద్ధి చేయడానికి ఒపెక్, భారత్ కలిసి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఒపెక్ ప్రధాన కార్యదర్శి శ్రీ హైథమ్ అల్ ఘైస్ మాట్లాడుతూ.. "భారత్‌తో చర్చలు ప్రాధాన్యత కలిగిన అంశం. ప్రస్తుత ప్రపంచ ఇంధన పరిస్థితుల్లో భారత్‌కు ఉన్న ప్రాముఖ్యతను మేము గుర్తిస్తున్నందున.. రాబోయే దశాబ్దాల్లో ఈ ప్రాముఖ్యత మరింత పెరుగుతుంది" అని ఆయన అన్నారు. "2015లో న్యూఢిల్లీలో ప్రారంభమైన ఒపెక్-భారత్ ఇంధన చర్చలు 11 సంవత్సరాలుగా ఎంతో బలంగా కొనసాగుతున్నాయి" అని పేర్కొన్నారు.

ఇంధన సవాళ్లను పరిష్కరించడంలో భారత్ అనుసరిస్తున్న సమతుల్యమైన, వాస్తవికమైన, ఆచరణాత్మక విధానాన్ని ఒపెక్ ప్రధాన కార్యదర్శి శ్రీ హైథమ్ అల్ ఘైస్ ప్రశంసించారు. "భారత్ ఇంధన రంగానికి సంబంధించిన అనేక ప్రాధాన్యతలు ఒపెక్ ప్రాధాన్యతలతో సమానం" అని పేర్కొన్నారు.

అంతర్జాతీయ సహకారం, చర్చల పట్ల భారత ప్రభుత్వం చూపిస్తున్న దృఢమైన నిబద్ధతను కూడా శ్రీ అల్ ఘైస్ ప్రశంసించారు. "ప్రస్తుత కాలంలోని ప్రధాన సవాళ్లను పరిష్కరించడానికి దౌత్యం, చర్చలే మార్గాలని భారత ప్రభుత్వం నిరంతరం ప్రోత్సహిస్తుండటం తమ చర్చల్లో ప్రత్యేకంగా సంతోషం కలిగించే అంశం" అని తెలిపారు.

విలువైన సహకారాన్ని అందించినందుకు సమావేశంలో పాల్గొన్న వారందరికీ శ్రీ అల్ ఘైస్ కృతజ్ఞతలు తెలిపారు. ఒపెక్ ప్రతినిధి బృందానికి ఆతిథ్యం అందించిన శ్రీ హర్దీప్ సింగ్ పూరీకి ఒపెక్ సెక్రటేరియట్ తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ చర్చల పరిధిలో ఇప్పటివరకు సాధించిన పురోగతిని, సాంకేతిక స్థాయిలో సాధించిన అభివృద్ధిని కూడా సమావేశం ప్రశంసించింది. ఒపెక్, భారత్ మధ్య మరింత లోతైన ఇంధన సహకారాన్ని పెంపొందించడం ఎంతో ముఖ్యమని ఇరుపక్షాలు అంగీకరించడంతో సమావేశం ముగిసింది.

ఒపెక్-భారత్ ఇంధన చర్చల 8వ ఉన్నతస్థాయి సమావేశాన్ని ఆస్ట్రియాలోని వియన్నాలో పరస్పరం అనుకూలమైన తేదీన నిర్వహించాలని నిర్ణయించారు.

# ఆప్యాయ పలకరింపు.. ఆరోగ్యంపై ఆరా

## అనారోగ్యంతో ఉన్న కాంగ్రెస్ నాయకులను పరామర్శించిన ఝాన్సీ రాజేందర్‌రెడ్డి



వరంగల్, సెప్టెంబర్ 24:మండలంలో అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న కాంగ్రెస్ నాయకులను గురువారం టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్‌రెడ్డి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ముందుగా కొలనపల్లి గ్రామానికి వెళ్లి ఇటీవల కంటి శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కృష్ణమాచార్యులను పరామర్శించారు.

అనంతరం సూర్యతండాకు వెళ్లి అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ నాయకుడు హమ్య నాయక్‌ను కలిసి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. వైద్యుల సూచనల మేరకు చికిత్స కొనసాగిస్తూ ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. త్వరగా కోలుకుని సాధారణ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. ఆమె వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి, ఏఎంసి వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి, కొండూరు సర్పంచ్ రాయిని యాకయ్య, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మాచర్ల ప్రభాకర్, చెవ్వ కాశీనాథం, రెంటాల గోవర్ధన్ రెడ్డి, కాంచనపల్లి వనజరాణి, పీరని ప్రవీణ్, స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93.